ఈనాడు

ఆదివారం

12 అక్టోబరు 2025



మనసే... ఓ క్వశ్చన్ బ్యాంక్!




రుక్మిణీ వసంత్.. 'సప్త సాగరాలు దాటి' సినిమాతో తెలుగు యువతను విశేషంగా ఆకట్టుకుందీ కన్నడ బ్యూటీ. అందంలోనే కాదు అభినయంతోనూ ప్రేక్షకులను మెప్పిస్తూ.. ప్రస్తుతం అగ్రతారల సరసన వరస అవకాశాలు దక్కించుకుంటూ జోరు మీదుంది. ఇటీవల విడుదలైన 'కాంతార-చాప్టర్ 1' లోనూ యువరాణి పాత్రలో అదరగొట్టింది. ఆ అమ్మడి ముచ్చట్లే ఇవి..

అదే... టర్నింగ్ పాయింట్!

మాది ఆర్మీ కుటుంబం

మాది బెంగళూరుకు చెందిన ఆర్మీ కుటుంబం. మా నాన్న కల్నల్ వసంత్ వేణుగోపాల్. అమ్మ సుభాషిణి. 2007లో కశ్మీర్‌లోకి చొరబడుతున్న తీవ్రవాదులను అడ్డుకునే క్రమంలో జరిగిన ఎదురుకాల్పుల్లో నాన్న అమరుడయ్యారు. ఆయన ధైర్యసాహసాలను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం 'అశోకచక్ర'తో గౌరవించింది. నాన్న లేకపోవడంతో నన్నూ, చెల్లినీ అమ్మే కష్టపడి పెంచింది. అమ్మకు ఆ కష్టం తెలుసు కాబట్టే.. 'వీర్ రత్న' పేరిట ఓ సేవా సంస్థను నెలకొల్పింది. దాని ద్వారా అమర సైనికుల భార్యలకు అండగా నిలవడంతోపాటు వారి పిల్లలకు స్కాలర్‌షిప్స్ ఇవ్వడం ప్రారంభించింది.



అదృష్టాన్ని నమ్ముతా

'సప్త సాగరాలు దాటి' సినిమాలో హీరోయిన్ పాత్ర కోసం వెతుకుతున్నారని తెలిసింది. మీరు అంగీకరిస్తే నేను ఆడిషన్‌లో పాల్గొంటా' అని దర్శకుడికి ఒక మెసేజ్ చేశా. అది చూసి రమ్మని చెప్పారాయన. ఒకవేళ నేను పంపిన మెసేజ్‌ని ఆయన చూసుకోకపోయి ఉంటే.. ఈరోజు నేను ఈ స్థాయిలో ఉండేదాన్ని కాదేమో! అందుకే ఎంత కష్టపడినా, కొంచెం అదృష్టం కూడా కలిసిరావాలని నమ్ముతుంటా.

చిన్న చిన్న సరదాలే..

నావన్నీ చిన్న చిన్న సరదాలే. ప్రకృతిలో గడపడం, టీ తాగుతూ బిస్కెట్ తినడం, పురాతన కట్టడాలను సందర్శించడం, కుటుంబంతో కలిసి తీర్థయాత్రకు వెళ్లడం లాంటివన్నమాట.

అమ్మ మొదట భయపడినా..

అమ్మ క్లాసికల్ డాన్సర్ కావడంతో చిన్నప్పటి నుంచే నాకు కళలపైన ఆసక్తి పెరిగింది. అప్పుడు నాకు పదిహేనేళ్లుంటాయనుకుంటా... నన్ను ఏదైనా థియేటర్ క్లాసెస్‌లో చేర్పించమని అమ్మను అడిగా. అలా లండన్‌లోని రాయల్ అకాడమీ ఆఫ్ డ్రమటిక్ ఆర్ట్స్‌లో చేరి శిక్షణ తీసుకున్నా. ఆ తర్వాత సరదాగానే మోడలింగ్ మొదలుపెట్టా.
ఆ క్రమంలో అనుకోకుండానే ఒకసారి సినిమా అవకాశం వచ్చింది. సినిమా రంగంలో ఫెయిలయ్యే అవకాశాలే ఎక్కువ ఉండటంతో అమ్మ మొదట భయపడింది. ఆ తర్వాత నా ఆసక్తిని అర్థం చేసుకొని సరేనంది.

పుస్తకాల పురుగుని..

షూటింగుల కోసం ఏదైనా కొత్త ప్రాంతానికి వెళ్తే, దగ్గర్లో లైబ్రరీ ఎక్కడుందో వాకబు చేస్తుంటా. పుస్తకాల్లోని పాత్రలూ, వాటిని వర్ణించే విధానం, భావోద్వేగాలూ నటనలో నన్ను నేను మరింత మెరుగుపర్చుకునేందుకు ఉపయోగపడతాయి.

మెచ్చే నటులు

యశ్ అంటే చాలా అభిమానం. రొమాంటిక్ కామెడీ సినిమాల నుంచి పాన్ ఇండియా స్టార్‌గా తనను తాను తీర్చిదిద్దుకున్న తీరు నిజంగా అద్భుతం. తెలుగులో అయితే రామ్‌చరణ్, ఎన్టీఆర్.

మైలురాయి

2019లో కన్నడ సినిమా 'బీర్బల్ ట్రైయాలజీ'తో నటిగా రంగప్రవేశం చేశా. అదే ఏడాది 'అప్‌స్టార్ట్స్'తో బాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చా. కానీ, నాకు అనుకున్న గుర్తింపు రాలేదు. దాంతో 'ఇంకో సినిమా ఛాన్స్ వస్తుందా? వేరే పని చేసుకోవాలా?' అనే సందిగ్ధంలో పడిపోయా. అదే సమయంలో వచ్చిన 'సప్త సాగరాలు దాటి' చిత్రం నా కెరీర్‌కు మైలురాయిగా నిలిచిపోయింది. అందులో నా నటన నచ్చడంతోనే 'కాంతార' ప్రీక్వెల్‌లో రిషబ్ శెట్టి అవకాశం ఇచ్చారు. ఇందులో నాది యువరాణి పాత్ర. అందుకోసం గుర్రపు స్వారీ, కత్తియుద్ధం నేర్చుకున్నా.. యాక్షన్ సీన్లలోనూ నటించా. కన్నడ సినిమా 'బాణదరియల్లి' కోసం సర్ఫింగ్ కూడా నేర్చుకున్నా. త్వరలోనే పెద్ద హీరోల సరసన పాన్ ఇండియా చిత్రాల్లోనూ నటించబోతున్నా!

అదో ఎమోషన్..

చీర అంటే నాకో ఎమోషన్. కోపం, బాధ, సంతోషం ...ఇలా సందర్భమేదైనా అన్నింటికీ చీరే సమాధానం. చీర కట్టుకోవడమంటే అంత ఇష్టం నాకు.

నచ్చే ఫుడ్

వేడి వేడి అన్నంలో నెయ్యి వేసుకొని, దానిపైన కాస్త ఉప్పు చల్లుకొని తినడమంటే భలే ఇష్టం. ఆ తర్వాత కొబ్బరి నీళ్లు, ఐస్‌క్రీమ్, ఇడ్లీ సాంబార్.



జీవితం ఓ ప్రతిబింబం



ఓ బాలుడు ఒక గుహ దగ్గర నివసిస్తూండేవాడు. ఆ గుహ అవతలి వైపు నుంచి గాలి తరగల మీదుగా వస్తుండే ప్రతిధ్వనులు అతనికి విచిత్రంగా అనిపించేవి. ఆ గుహకు అవతల తనలాంటి మరో చిన్నబ్బాయి ఉంటున్నాడనీ అతను తనను వెక్కిరిస్తున్నాడనీ అనుకునేవాడు. 'నాకు నువ్వంటే ఇష్టం లేదు' అని అరిచేవాడు. 'నాకు నువ్వంటే ఇష్టం లేదూ' అనే మాటలు ప్రతిధ్వనిస్తూ ఉండేవి.

ఆ అబ్బాయి ఓ రోజు తన తల్లికి ఫిర్యాదు చేశాడు 'గుహ అవతల ఉండేవాడు చాలా అల్లరబ్బాయి, నాకు వాడంటే ఇష్టమే లేదు.'

ఆ పిల్లవాడికి తల్లి సలహా ఇచ్చింది... 'నువ్వంటే నాకిష్టం అని ఒక్కసారి నువ్వు చెప్పి చూడవచ్చు కదా' అని.

అమ్మ సలహా పెద్దగా నచ్చకపోయినా ఒప్పుకున్నాడా పిల్లాడు. తన అయిష్టతని కష్టపడి అధిగమించాడు. గుహ ముఖం దగ్గర నిలబడి బిగ్గరగా అరిచాడు 'నువ్వంటే నాకిష్టమే.'

తిరిగి జవాబు వచ్చింది... 'నువ్వంటే నాకిష్టమే', 'నువ్వంటే నాకిష్టమే.'

ఆ చిన్నారి ఆనందానికి అంతే లేకుండా పోయింది. గబగబా పరిగెత్తుకుంటూ అమ్మ దగ్గరకు వెళ్ళిపోయాడు. 'అమ్మా అమ్మా, ఆ గుహకి మరో వైపు ఉన్న అబ్బాయి నాకు స్నేహితుడే' అని ఎంతో ఉద్వేగంతో చెప్పాడు.

(అందరూ దాన్ని ప్రతిధ్వని అంటారు. నిజానికి అదే జీవితం. మన ప్రతీ మాటనీ చేతనీ అది మనకు తిరిగి వెనక్కిచ్చేస్తుంది. జీవితమంటే ఏదో బ్రహ్మపదార్థం కాదు, కేవలం మన చర్యల ప్రతిబింబమే. ఈ ప్రపంచంలో చాలా చాలా ప్రేమ ఉండాలని మీరనుకుంటే మీ హృదయంలో మరింత ప్రేమని నింపుకోండి. మీ బృందంలో సమర్థత మరింత పెరగాలనుకుంటే ముందు మీ సమర్థతను పెంచుకోండి. ఈ సూత్రం జీవితంలోని అన్ని సందర్భాల్లోనూ అన్నిటికీ వర్తిస్తుంది. మీరు అందించే ప్రతీదాన్నీ జీవితం మీకు తిరిగిచ్చేస్తుంది... అది మంచైనా, చెడైనా.)

– భాస్కర్ గుప్తా

లోపల...





మంచిమాట

అదృష్టంతో వచ్చినది అహంకారాన్ని కలిగిస్తుంది.
తెలివితో సంపాదించినది సంతోషాన్ని ఇస్తుంది.
కష్టపడి సంపాదించినది సంతృప్తిని ఇస్తుంది.

పేదవిద్యార్థులూ నాసాకి వెళ్లారు!

పద్దెనిమిదేళ్ల అశుతోష్‌ది నిరుపేద కుటుంబం. కాలేజీకి వెళుతూనే సైకిల్ మెకానిక్‌గానూ పనిచేస్తుండేవాడు. ఒక్క సైకిలే కాదు... ఏ యంత్రానికి ఏ సమస్య వచ్చినా దాన్ని ఇట్టే పసిగట్టగల అశుతోష్ నైపుణ్యాన్ని గమనించింది అతని కాలేజీలోని 'యంగ్ టింకర్ ఫౌండేషన్' క్లబ్. అతనికి ఆధునిక నైపుణ్యాలు నేర్పించి... మెరికగా తీర్చిదిద్దింది. 'నాసా' నిర్వహించే 'హ్యూమన్ ఎక్స్‌ప్లొరేషన్ రోవర్ ఛాలెంజ్'(హెర్క్)కి భారత్ నుంచి వెళ్లిన విద్యార్థుల బృందంలో అతణ్నీ భాగస్వామిని చేసింది! ఇదే బృందంలో రీనా అనే విద్యార్థిని కూడా ఉంది. తనూ అంతే... పేదరికం కారణంగా వెల్డర్‌గా పనిచేస్తుండేది. అందులో రీనా కౌశలాన్ని గమనించిన యంగ్ టింకర్ ఫౌండేషన్ తననీ నాసా పోటీలో భాగస్వామిని చేసి... అమెరికాకి పంపించింది! ఆ అనుభవం ఇచ్చిన ఆత్మవిశ్వాసంతో అశుతోష్, రీనా ఇద్దరూ సొంత స్టార్టప్‌లు పెట్టారు. 'యంగ్ టింకర్ ఫౌండేషన్' క్లబ్‌లు ఇలా ఇప్పటిదాకా... వేలాది విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపాయి. ఒడిశాకి చెందిన అనిల్ ప్రధాన్, వైశాలి శర్మ దీని వ్యవస్థాపకులు. ఇద్దరూ ఇంజినీరింగ్ చదువుతున్నప్పుడే 'యంగ్ టింకర్ ఫౌండేషన్' క్లబ్బులకి శ్రీకారం చుట్టారు. దేశవ్యాప్తంగా పలు స్కూళ్లూ కాలేజీల్లో వీటిని ఏర్పాటు చేయడమే కాదు... అవసరమైనచోట 'యంగ్ టింకర్ స్పేస్' పేరుతో ఆధునిక ల్యాబ్‌లూ స్థాపిస్తున్నారు. హైదరాబాద్‌లోని ఏపీ మోడల్ స్కూల్‌తోపాటూ ఇక్కడి చీర్స్ ఫౌండేషన్, నాగర్‌కర్నూల్‌లోని టచ్‌ఆర్ఫనేజ్ వంటి అనాథాశ్రమాల్లోనూ ఈ క్లబ్‌లు ఉన్నాయి!



టింకరింగ్... మన స్కూళ్లూ, కాలేజీల్లో ఎక్కువగా వినిపిస్తున్న పదం ఇది. డిక్షనరీ అర్థం వేరే ఉన్నా... ఓ సమస్యకి సాంకేతికత ఆధారంగా మనం చూపే పరిష్కారాన్ని ఇలా పిలుస్తున్నారు. ఓ ఆవిష్కరణకి ముందు దశ అనొచ్చు దీన్ని. ఈ మూడు విద్యార్థి సంఘాలూ అందుకే తమ పేరులో టింకరింగ్ అన్నపదాన్ని వాడుతున్నాయి. వేలాదిమందిని ఆవిష్కర్తలుగానూ, సైబర్ సాంకేతిక నిపుణులుగానూ, అంకురాల వ్యవస్థాపకులుగానూ మారుస్తున్నాయి. ఆ కొత్త క్లబ్‌ల కథేమిటో చూద్దామా...!

విద్యార్థుల చేత... విద్యార్థుల కోసం...

లక్షమందికి సాయపడింది!



2014 నాటి మాట ఇది. కేరళలోని విద్యార్థులు ఎంతోమంది కంప్యూటర్ ఇంజినీరింగ్ చదువుతున్నా... వాళ్ల నైపుణ్యం అంతంత మాత్రంగానే ఉంటోంది. అతికీలకమైన 'కోడింగ్'పైన ఏ అవగాహనా ఉండేది కాదు. ఆ పరిస్థితిని మార్చాలనుకున్నారు మూసా మెహర్, అబిద్ అబూబక్కర్, నిధియా, ప్రవీణ్ శ్రీధర్ అనే విద్యార్థులు. తాము చదువుతున్న 'కొచిన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ'లోనే 'ది టింకరింగ్‌హబ్ ఫౌండేషన్' అనే సంస్థని ప్రారంభించారు. ఆసక్తి ఉన్న విద్యార్థులందరికీ ఉచితంగా ప్రోగ్రామింగ్, వెబ్ డెవలప్‌మెంట్ తదితర నైపుణ్యాలపైన శిక్షణ మొదలుపెట్టారు. ఇందుకోసం వర్సిటీ లైబ్రరీలోని ఓ భాగాన్నే ప్రత్యేక ల్యాబ్‌గా మార్చుకున్నారు. క్రమంగా దేశవిదేశాల నుంచి నిపుణుల్ని రప్పించి శిక్షణ ఇవ్వసాగారు. ఇలా శిక్షణ తీసుకున్నవాళ్లు విదేశాల్లో కొలువులు సాధిస్తుండటంతో మిగతా విద్యాసంస్థలూ తమ క్యాంపస్‌లో 'ది టింకరింగ్‌హబ్ ఫౌండేషన్' క్లబ్బుల్ని ఏర్పాటు చేసుకున్నాయి. మామూలుగా సీనియర్ విద్యార్థులు జూనియర్‌లకి నేర్పించే విధంగానే ఈ క్లబ్‌లు పనిచేసినా... నెలకోసారి బయట నుంచీ నిపుణులు వచ్చి పాఠాలు బోధిస్తారు. ఏడాదికోసారి భారీ స్థాయిలో 'హ్యాకథాన్'లూ నిర్వహిస్తారు. అమ్మాయిలకోసమని 'టింక్-హర్-థాన్' పేరుతో దేశంలోనే అతిపెద్ద పోటీ ఏర్పాటుచేస్తున్నారు. ఏదేమైనా కేరళవ్యాప్తంగా ఏటా 15 వేలమంది విద్యార్థులకి ఉచితంగా సైబర్ నైపుణ్యాలని అందిస్తున్న ఈ క్లబ్బుల ద్వారా... ఇప్పటిదాకా లక్షమంది విద్యార్థులు లబ్ధిపొందారు!

ఆ విద్యార్థులే గైడ్‌లు...



టింకర్‌ఛాంప్స్... 19 మంది విద్యార్థుల బృందం ఇది. వీళ్లలో కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకూ ఉన్న పలు ప్రాంతాలకి చెందిన విద్యార్థులున్నారు. వీరిలో మేఘనా దొడ్డిపల్లె, ఖుష్బూ జైన్, శ్రేయస్, శ్రీరక్ష... తెలుగు రాష్ట్రాలవాళ్లు. ఈ 19 మంది దేశవ్యాప్తంగా ఉన్న సుమారు 50 వేలమంది విద్యార్థుల్ని నడిపిస్తున్నారు! వాళ్ల కోసం ఆన్‌లైన్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు, ఏఐ, ఎంఎల్ వంటి అత్యాధునిక కోర్సులపైన నిపుణుల్ని రప్పించి సూచనలు ఇప్పిస్తున్నారు. ఇంతకీ ఏ విద్యార్థుల కోసం ఈ పాఠాలు చెబుతున్నారంటారా... మనదేశంలోని పలు పాఠశాలల్లో ఉన్న అటల్ టింకరింగ్ ల్యాబ్స్(ఏటీఎల్) గురించి వినే ఉంటారు. పాఠశాల విద్యార్థుల్నీ ఆవిష్కర్తలుగా చేయడం కోసం కేంద్ర నీతి ఆయోగ్ ఆధ్వర్యంలో 2020లో ఇవి ఏర్పాటయ్యాయి. వాటన్నింటికీ కలిపి జాతీయస్థాయిలో ఏటా 'టింకర్‌ప్రెన్యూర్' అనే పోటీని నిర్వహిస్తుంటారు. 2020 నుంచి ఇప్పటిదాకా ఆ పోటీల్లో నెగ్గిన 19 మంది విద్యార్థులు కలిసి- ఇందులో కొత్తగా పాల్గొంటున్నవాళ్లకి ఏమేం చదవాలో ఎలా చదవాలో శిక్షణ ఇవ్వాలన్న లక్ష్యంతో- 'టింకర్ ఛాంప్స్' అనే స్వతంత్ర సంఘంగా ఏర్పడ్డారు. అలా మొదలై... నేడు అటు ప్రభుత్వానికీ ఇటు విద్యార్థులకీ సహకరిస్తూ ఈవెంట్ మేనేజర్లుగానూ మారారు!

అమ్మవారికి సలామ్ పూజ చేస్తారిక్కడ!





త్రిశక్తి స్వరూపమైన జగన్మాత ఎదురుగా నంది విగ్రహం ఉండటం... అమ్మవారు లింగ రూపంలో పూజలు అందుకోవడం... ఏడాదికోసారి దేవి సన్నిధిని కుబ్జా నది స్పృశించడం... ఇవన్నీ కమలశిలే బ్రాహ్మీ దుర్గాపరమేశ్వరి ఆలయంలో కనిపించే ప్రత్యేకతలు. వందల ఏళ్ల చరిత్ర కలిగిన ఈ క్షేత్రాన్ని దర్శించుకుంటే సకల శుభాలూ కలుగుతాయని భక్తుల విశ్వాసం.

చుట్టూ పచ్చని చెట్లూ ఎత్తయిన కొండల నడుమ, కుబ్జానది సమీపాన కనిపిస్తుంది కమలశిలే బ్రాహ్మీ దుర్గాపరమేశ్వరి క్షేత్రం. కమలశిలే అంటే... శిల- కమలం రూపంలో ఉందని అర్థం. కర్ణాటక, ఉడుపి జిల్లా, కుందాపుర నుంచి ముప్ఫైఅయిదు కిలోమీటర్ల దూరంలో కమలశిల అనే ప్రాంతంలో ఉండే ఈ ఆలయంలో అమ్మవారు దుర్గ-లక్ష్మి-సరస్వతి అవతారాల సమ్మిళితమైన దుర్గాపరమేశ్వరిగా సాక్షాత్కరిస్తూ... లింగరూపంలోనూ పూజలు అందుకోవడం విశేషం. అందుకు నిదర్శనంగా అమ్మవారి సన్నిధానం ఎదురుగా నంది విగ్రహాన్నీ చూడొచ్చు. ఈ ఆలయంలో జగన్మాత స్వయంభువుగా కొలువుదీరడం వెనుక ఓ కథ ప్రాచుర్యంలో ఉంది.

స్థలపురాణం

పురాణాల ప్రకారం.. కైలాసంలో పింగళ అనే నృత్యకారిణి ఉండేది. ఓసారి అమ్మవారు నృత్యం చేయమని ఆదేశించినా ఆమె అహంకారంతో తిరస్కరించింది. దీంతో పార్వతీదేవి ఆగ్రహించి, భూలోకంలో అందవిహీనంగా, మరుగుజ్జు రూపంలో జన్మించమంటూ శపించింది.



పశ్చాత్తాప పడిన ఆ నృత్యకారిణి శాపవిమోచనం కలిగించమంటూ అమ్మవారిని అర్థించింది. దేవి కరుణించి, కమలశిల ప్రాంతానికి వెళ్లి తపస్సు చేయమనీ, తాను ఖారాసురుడిని సంహరించాక అక్కడ లింగరూపంలో స్వయంభువుగా వెలుస్తాననీ చెప్పింది. అలా పింగళ భూలోకంలో కుబ్జగా జన్మించి అమ్మవారి అనుగ్రహం కోసం తపస్సు చేయడం ఆరంభించింది. కొన్నాళ్లకు, మాట ఇచ్చినట్లుగానే ఖారాసురుడిని వధించాక ఈ ప్రాంతానికి వచ్చి కుబ్జను అనుగ్రహించింది మహాశక్తి. అంతేకాదు, మధురకు వెళ్లి కృష్ణుడిని పూజించాక శాపవిమోచనం కలుగుతుందని చెప్పడంతో, కుబ్జ అక్కడకు వెళ్లి స్వామిని పూజించి పూర్వ రూపాన్ని పొందిందని ఐతిహ్యం.

'సలామ్ పూజ' ప్రత్యేకం...

ప్రశాంతమైన వాతావరణంలో ద్రవిడుల కాలం నాటి నిర్మాణ శైలితో అబ్బురపరుస్తుందీ ఆలయం. ఆలయ ఆవరణలో ప్రవేశించే భక్తులకు దుర్గా పరమేశ్వరి సింహవాహినిగా దర్శనం ఇస్తుంది. ఒకప్పుడు, ఈ ఆలయాన్ని వరదలు ముంచెత్తడంతో... నిర్మాణం శిథిలావస్థకు చేరుకుందట. తర్వాత మలబార్ చెక్క, పనస చెక్కతో పునర్నిర్మించారట. ఇక్కడున్న ధ్వజస్తంభాన్ని కూడా కుబ్జా నది ఒడ్డున లభించే మలబార్ చెక్కతోనే రూపొందించి, వెండి తాపడం చేశారని చెబుతారు. ఇక, రోజువారీ పూజలు కాకుండా... ఏడాదికోసారి అంగరంగ వైభవంగా నిర్వహించే జాతరనూ, నవరాత్రి వేడుకల్నీ తిలకించేందుకు రెండు కళ్లూ సరిపోవు. ఇక్కడ చేసే చండీహోమాన్నీ చూసి తీరాల్సిందే. ఈ ప్రాంతాన్ని హైదర్‌అలీతోపాటు ఆయన కుమారుడు టిప్పుసుల్తాన్ కూడా పాలించారట. ఆ సమయంలో ఆలయం ధ్వంసం కాకుండా ఈ తండ్రీకొడుకులు కాపాడారని అంటారు. ఆ గౌరవార్థం నేటికీ ప్రతిరోజూ సాయంత్రం ఇక్కడ 'సలామ్ పూజ' పేరుతో ప్రత్యేక పూజ చేస్తారు అర్చకులు. ఇవన్నీ ఒకెత్తయితే... ఏడాదికోసారి కుబ్జానది ఉప్పొంగి, అమ్మవారి గర్భగుడివరకూ వస్తుంది. దేవి తనకు శాపవిమోచనం కలిగించినందుకు కృతజ్ఞతగా, సంవత్సరానికోసారి ఇలా కుబ్జ అమ్మవారి సన్నిధికి చేరుకుని పూజలు చేస్తుందని స్థానికుల నమ్మకం. ఆ వింతను చూసేందుకే ఎక్కడెక్కడినుంచో భక్తులు ఈ ఆలయానికి వస్తారు. దుర్గాపరమేశ్వరిని పూజిస్తే మానసిక ప్రశాంతత లభిస్తుందనీ, కోరిన కోర్కెలు నెరవేరతాయనీ అంటారు. అమ్మ దర్శనం తర్వాత స్థానికంగా ఉండే కమలశిలే గుహనూ దర్శించుకోవచ్చు. ఈ గుహలోనే ఎంతోమంది మహర్షులు తపస్సు చేశారని ప్రతీతి. గుహ ఎదురుగా కాసేపు ధ్యానం చేస్తే ఆధ్యాత్మిక చింతన పెరుగుతుందని భక్తుల విశ్వాసం.

ఇలా చేరుకోవచ్చు...

ఈ ఆలయానికి విమానంలో రావాలనుకునేవారు మంగళూరులో దిగాలి. అక్కడినుంచి దాదాపు 125 కిలోమీటర్ల దూరంలో ఉండే ఆలయాన్ని చేరుకునేందుకు బస్సులూ, ప్రైవేటు వాహనాలూ ఉంటాయి. రైల్లో అయితే, కుందాపుర రైల్వేస్టేషన్ నుంచి సుమారు ముప్ఫైఅయిదు కిలోమీటర్ల దూరంలో ఉంటుందీ క్షేత్రం. ★

పరిశోధన



పక్షవాతం నుంచి బయటపడొచ్చిక...

వెన్నెముక విరిగినా, దెబ్బతిన్నా... పక్షవాతం వచ్చి, చక్రాల కుర్చీకి లేదా పూర్తిగా మంచానికే పరిమితమవుతుంటారు. అలాకాకుండా గాయపడ్డ వెన్నెముక నరాలని తిరిగి పునరుద్ధరించి, ఆ పరిస్థితి నుంచి బయటపడేసే 'పాలీలామినిన్' అనే ఔషధాన్ని కనిపెట్టారు బ్రెజిల్ శాస్త్రవేత్తలు. వెన్నెముక దగ్గర నరాలు చాలా సున్నితంగా ఉంటాయి. ఇవి దెబ్బతింటే తిరిగి మామూలు స్థితికి రావడం దాదాపుగా అసాధ్యం. అందుకే వెన్నెముక సమస్యల కారణంగా కొన్ని లక్షలమంది మంచానికే పరిమితం అవుతున్నారు. దీనికి పరిష్కారంగా మన శరీరంలోనే ఉండే సహజమైన ప్రొటీన్ లామినిన్‌లో కొన్ని మార్పులు చేసి ఈ పాలీలామినిన్ అనే ఔషధాన్ని తయారుచేశారు. దీనికోసం బ్రెజిల్ శాస్త్రవేత్తలు సుమారు పాతికేళ్లపాటు కష్టపడ్డారట. ఈ ఔషధం- ఇటీవలే అయిన గాయాలనే కాకుండా, కొన్నేళ్ల క్రితం చచ్చుబడిన నరాల్లోని కణాల్ని కూడా తిరిగి పునరుద్ధరించి అక్కడ ఒక మెష్‌లాంటి రక్షణ కణజాలాన్ని ఏర్పాటు చేస్తుందట. ఫలితంగా పక్షవాతం నుంచి కోలుకుని తిరిగి నడవొచ్చని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

ప్లాస్టిక్‌ను తినే పురుగులు...



ప్రపంచాన్ని పట్టిపీడిస్తున్న ప్లాస్టిక్ సమస్యకు ప్లాస్టీవోర్స్ లేదా వ్యాక్స్‌వార్మ్ కేటర్ పిల్లర్స్ రూపంలో శాస్త్రవేత్తలకు చక్కని పరిష్కారం దొరికింది. కొన్ని వందల ఏళ్లపాటు భూమిలో కలవకుండా ఇబ్బంది పెట్టే ప్లాస్టిక్‌ని... ఈ వ్యాక్స్‌వార్మ్ పురుగులు 24 గంటల్లోనే తినేసి అరిగించుకుంటాయట. పైగా అలా తిన్న ప్లాస్టిక్‌ని అవి శరీరంలో మేలురకం కొవ్వులుగా మార్చుకోవడాన్ని కెనడాలోని బ్రాండన్ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు గమనించారు. మనం తిన్న ఆహారంలో అధికంగా ఉన్న కెలొరీలు కొవ్వుగా మారినట్టే, ఇవి కూడా ప్లాస్టిక్‌ను తిని దాన్ని కొవ్వుగా మార్చుకుంటాయట. ఈ పురుగుల్లోని గట్ బ్యాక్టీరియాపైన పరిశోధన చేసి వాటిల్లోని ఏ ఎంజైములకు ప్లాస్టిక్‌ని కరిగించుకునే శక్తి ఉందో శాస్త్రవేత్తలు కనిపెట్టారు. ఈ పురుగులని వాడి ప్లాస్టిక్ సమస్యకు పరిష్కారం తీసుకురావడంతోపాటు, ప్రొటీన్ అధికంగా ఉండే ఈ పురుగులని చేపలకు ఆహారంగా అందివ్వడం ద్వారా తక్కువ ఖర్చులో ఆక్వాఫుడ్‌ని తయారు చేయొచ్చని అంటున్నారు.

కొవ్వు అక్కడ ఉంటే కష్టమే...




అధిక బరువు ఎన్ని అనారోగ్యాలకు దారితీస్తుందో తెలిసిన విషయమే! అయితే, ఆ బరువుకు కారణమైన కొవ్వు శరీరంలో ఏ అవయవాల దగ్గర పేరుకుందో దాన్ని బట్టికూడా కొన్ని రకాల క్యాన్సర్లు వచ్చే అవకాశం ఉందని ఇంగ్లండ్‌లోని బ్రిస్టల్ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు చేసిన అధ్యయనంలో తేలింది. ఉదాహరణకి ఇద్దరు అధిక బరువున్న వ్యక్తులనే తీసుకుంటే వాళ్లు సమానమైన బరువే ఉన్నా, వాళ్లిద్దరిలో కొవ్వు ఒకే చోట పేరుకోవాలని లేదు. ఒకరికి పొట్టచుట్టూ- అంటే కాలేయం, కిడ్నీ, పేగులు చుట్టూ పేరుకోవచ్చు. ఈ రకమైన కొవ్వుని విసరల్ ఫ్యాట్ అంటారు. ఇక మరొక వ్యక్తికి తొడలూ, పిరుదుల్లో మాత్రమే పేరుకోవచ్చు. వీరిలో మొదటి వ్యక్తికి లివర్, కిడ్నీ, కొలెరెక్టల్ సహా 12 రకాల క్యాన్సర్లు రావడానికి ఎక్కువ ఆస్కారం ఉందట. అలాగే ఈ కొవ్వు కొన్నిరకాల హార్మోన్లలో మార్పులకు కూడా కారణం అవుతోందనీ, దాంతో తీవ్రమైన అనారోగ్యాలకూ దారితీయొచ్చనీ తెలిసింది. ఇక రెండో రకం కొవ్వు- అంటే పిరుదులూ, తొడల దగ్గర ఉండే కొవ్వు రొమ్ము క్యాన్సర్‌ని రానివ్వకుండా అడ్డుకుంటుందట. దీన్నిబట్టి పొట్ట చుట్టూ ఉండే కొవ్వుని అంత తేలిగ్గా తీసుకోవడానికి లేదనీ వైద్యులు అంటున్నారు.

ఏడాదైనా ఇంట్లోనే ఉంటాయి...



బయట రోడ్లపైన ఉండే పొగ, దుమ్మూధూళిని చూసి... 'అమ్మో ఎంత కాలుష్యమో' అని ఆందోళన పడతాం. ఇంటిని శుభ్రంగా ఉంచుకుంటాం కాబట్టి దానంత పదిలం మరొకటి లేదని నమ్ముతాం. కానీ ఈ అభిప్రాయంలో ఎంతమాత్రం నిజం లేదంటోంది కాలిఫోర్నియా యూనివర్సిటీ అధ్యయనం. ఎందుకంటే... ఇంట్లో మనం వాడే పెర్‌ఫ్యూముల నుంచి వెలువడే వీఓసీ కణాలూ(ఓలటైల్ ఆర్గానిక్ కాంపౌండ్స్), వంటింట్లోంచి వచ్చే పొగలూ, మాడు వాసనలూ, సిగరెట్ తాగితే వెలువడే నికోటిన్ కణాలూ వంటివి అంత త్వరగా బయటకు పోవట. ఇవి ఏళ్ల తరబడి ఇంట్లోని గోడలకున్న పెయింట్లపైనా, చెక్క ఫర్నిచర్‌పైనా, సిమెంట్ గచ్చుపైనా అలానే ఉండిపోతాయట. ఉదాహరణకి ఇంట్లో సిగరెట్ తాగితే ఆ నికోటిన్ కణాలు ఆరునెలలపాటు గోడలకు అతుక్కుని ఉంటాయన్నమాట. ఊడ్చి, తడిబట్ట పెడితే నేలపైన ఉండే కాలుష్య కారకాలు పోతాయేమోకానీ గోడలకు అంటిన ఈ కణాలు మాత్రం నెమ్మదినెమ్మదిగా విడుదల అవుతూ మన చర్మంలోకి వెళ్లి అనారోగ్యాలు వచ్చే ప్రమాదం ఉందని ఈ పరిశోధన చెబుతోంది. అందుకే ఎప్పటికప్పుడు తడిబట్ట పెట్టడంతోపాటు తలుపులు బార్లా పెట్టి ఉంచడం, గోడలను వారానికోసారైనా వ్యాక్యూమ్ క్లీనింగ్ చేయడం వల్ల కొంతమేలు జరుగుతుందని శాస్త్రవేత్తలు అంటున్నారు.



బీపీ షుగర్ సమస్యలు ముప్ఫైయ్యేళ్లకే ముప్పు తెస్తున్నాయి... కంటి సమస్యల్నీ తోడుతెచ్చుకుంటున్నాయి. మొబైల్ ఫోన్‌ల పుణ్యమాని... చిన్నారులకూ చూపు సమస్యలు వస్తున్నాయి. నగరాల్లో ఉన్నవాళ్లు ఈ సమస్యల్ని అలా గుర్తించగానే ఇలా చికిత్సకి వెళ్లిపోవచ్చు కానీ పల్లెప్రాంతాల్లో ఇప్పటికీ ఆ పరిస్థితి లేదు. సమస్య ఏదైనా సరే... బాగా ముదిరాకకానీ ఆసుపత్రులకి వెళ్లట్లేదు వాళ్లు! అందుకనే పల్లెవాసుల కోసం ఓ నిశ్శబ్ద విప్లవాన్నే సృష్టిస్తోంది... ఎల్వీప్రసాద్ నేత్రవైద్య విజ్ఞాన సంస్థ! అదేమిటో చూద్దామా...

పల్లెపట్టుల్లో... కంటి వైద్యం పూర్తి ఉచితం!





మంత్రు ఆటో డ్రైవర్. గుంటూరు జిల్లా కారెంపూడి మండలంలోని లాలిపురం తండాలో ఉంటాడు. తనకో పాప... పేరు హర్షిణి. రెండున్నరేళ్ల ఆ చిట్టితల్లికి కుడి కంటిపాపలో తెల్లని వెలుగులాంటిదేదో కనిపించసాగింది. కంటిచూపూ మందగించింది. అప్పుడే వాళ్ల ప్రాంతంలో ఎల్వీ ప్రసాద్ సంస్థ నియమించిన 'విజన్ గార్డియన్' పాప సమస్యని గుర్తించారు. కారెంపూడిలో అదే సంస్థ నడుపుతున్న విజన్ సెంటర్‌కి తీసుకొచ్చారు. అక్కడి విజన్ టెక్నీషియన్ ప్రాథమిక పరీక్షల్లోనే... హర్షిణికి కంటి క్యాన్సర్(రెటినోబ్లాస్టోమా) ఉండొచ్చని అనుమానించింది. హైదరాబాద్‌లోని నిపుణులతో టెలీ-కన్సల్టేషన్ ద్వారా ఆ విషయాన్ని నిర్ధారించుకుని విజయవాడలోని ఎల్వీప్రసాద్ కోడె వెంకటాద్రి క్యాంపస్ (తృతీయ శ్రేణి కేంద్రం)కి తీసుకెళ్లారు. పాప క్యాన్సర్ కణాలు మిగతా అవయవాలకి పాకే ప్రమాదం ఉంది కాబట్టి... కుడికంటిని వెంటనే తీసేయాలనీ అక్కడ చెప్పారు. కానీ నిరక్షరాస్యుడైన హర్షిణి తండ్రి మంత్రుకి అవేవీ అర్థం కాలేదు. 'నా బంగారుతల్లి కన్ను పీకేస్తారా?' అని బాధపడుతూ ఇంటికి తీసుకెళ్లిపోయాడు. ఫోన్ స్విచ్ఛాఫ్ చేశాడు. ఎవరు ఎంత చెప్పినా వినలేదు! మరేదైనా ఆసుపత్రి అయితే ఆ తండ్రీకూతుళ్లని వాళ్ల ఖర్మకి వదిలేసేదే కానీ... ఎల్వీప్రసాద్ సంస్థ అలా చేయలేదు. అతన్ని ఒప్పించడానికి హైదరాబాద్ ఎల్వీప్రసాద్ సంస్థ క్యాన్సర్ విభాగం డైరెక్టర్ డాక్టర్ స్వాతి కలికి స్వయంగా రంగంలోకి దిగారు. పాప ప్రాణానికి ఇదెంత ప్రమాదకరమో విడమర్చి చెప్పి... హైదరాబాద్‌కి రప్పించారు. అక్కడ హర్షిణికి కన్ను తొలగించి... ఆ తేడా ఏమాత్రం తెలియకుండా ప్రాస్థటిక్ కన్నుపెట్టారు. ఎనిమిది కీమో థెరపీలతో క్యాన్సర్‌ని నయం చేసేశారు. ఇవన్నీ పూర్తి ఉచితంగా అందించడమే... ఇక్కడ విశేషం. ఎల్వీప్రసాద్ సంస్థ పల్లెటూరి రోగులకి అందిస్తున్న సేవలకి ఇదో మచ్చుతునక!

కోట్లమందికి!

'పేద- ధనిక, పల్లె-పట్టణం అన్న తేడా లేకుండా ప్రతి ఒక్కరికీ ప్రపంచస్థాయి కంటి వైద్యం అందించడమే మా సంస్థ లక్ష్యం' అంటుంటారు ఎల్వీప్రసాద్ ఆసుపత్రి వ్యవస్థాపక ఛైర్మన్ డాక్టర్ గుళ్లపల్లి నాగేశ్వరరావు. దాన్ని నిజం చేస్తూ 1996లోనే రెండు తెలుగు రాష్ట్రాల్లోని చిన్న పట్టణాల్లో ద్వితీయ శ్రేణి చికిత్సా కేంద్రాలని ఏర్పాటుచేయడం మొదలుపెట్టిందీ సంస్థ. వాటి పరిధిలోని గ్రామాల్లో 'విజన్ సెంటర్'లని స్థాపించడం ప్రారంభించింది. అవి కూడా సరిపోలేదని... ప్రతి విజన్ కేంద్రం తరపున 'విజన్ గార్డియన్'లని నియమించింది. వీటికి దగ్గర్లో ఉన్న నగరాల్లో తృతీయశ్రేణి కేంద్రాలనీ నెలకొల్పింది. మారుమూల పల్లెల్లో సేవలందించే 'విజన్ గార్డియన్'లు చుట్టుపక్కలున్న ఐదు వేలమంది బాధ్యత తీసుకుంటారు. గ్రామాల్లో కంటి సమస్య ఉన్నవాళ్లని గుర్తించి... దగ్గర్లో ఉన్న విజన్ సెంటర్‌లకి పంపిస్తారు. అందులో ఉన్న విజన్ టెక్నీషియన్‌లు వాళ్లని మరింత క్షుణ్ణంగా పరిశీలించి... సమస్య కేవలం చూపుకే పరిమితమైతే కళ్లద్దాలు అందిస్తారు. శుక్లాల సమస్య ఉంటే ద్వితీయశ్రేణి కేంద్రాలకి పంపిస్తారు. ఇంకాస్త పెద్ద సమస్య అయితే తృతీయ శ్రేణి కేంద్రాలకీ, అక్కడా చికిత్స అందించలేని రుగ్మతలు అయితే హైదరాబాద్ కేంద్రానికీ తీసుకెళ్తారు. ఆంధ్రప్రదేశ్‌లో 139 విజన్ సెంటర్‌లూ, 11 ద్వితీయశ్రేణి కేంద్రాలూ మూడు తృతీయ శ్రేణి కేంద్రాలూ ఉన్నాయి. తెలంగాణలో 76 విజన్ కేంద్రాలూ, ఏడు ద్వితీయ శ్రేణి కేంద్రాలూ పనిచేస్తున్నాయి. హైదరాబాద్‌లోనే సంస్థ ప్రధాన కేంద్రం ఉంది కాబట్టి... ఇక్కడ తృతీయశ్రేణి కేంద్రాల్లేవు. కర్ణాటక, ఒడిశాల్లోనూ ఇదే తరహా కేంద్రాలున్నాయి. ఇవన్నీ కలుపుకుంటే 311 కేంద్రాల ద్వారా గ్రామీణ ప్రాంతాలకు సేవల్ని అందిస్తోంది... ఎల్వీప్రసాద్ సంస్థ. వీటన్నింటి ద్వారా ఏటా కనీసం పాతిక లక్షలమందికి చికిత్స అందిస్తున్నారు. సమస్య ఎంత పెద్దదైనా సరే నిరుపేదల నుంచి ఒక్క పైసా కూడా తీసుకోవట్లేదు. ఇందుకోసం గత ఒక్క ఏడాదిలోనే ఈ సంస్థ రూ.95 కోట్ల రూపాయలు ఖర్చుచేసింది.

వాళ్లదే హవా!

ఎల్వీ ప్రసాద్ సంస్థ ఆరోగ్య సేవలన్నీ ఒక ఎత్తు... అది తాను అడుగుపెట్టిన గ్రామీణ ప్రాంతాల్లో యువతకి ఉపాధికి హామీ ఇవ్వడం మరొక ఎత్తు! ఇంటర్ పాసైన నిరుపేద యువతని విజన్ గార్డియన్‌లుగా తీసుకోవడంతోపాటూ... వాళ్లకి ఆసక్తి ఉంటే ఉచితంగా 'ఆప్టోమెట్రీ'లో శిక్షణ అందించి విజన్ టెక్నీషియన్‌లుగా నియమించుకుంటోంది. వాళ్లకి చక్కటి జీతభత్యాలు అందిస్తోంది. నాలుగు రాష్ట్రాల్లో రెండొందలకుపైగా విజన్ గార్డియన్‌లూ... నాలుగువందల మంది విజన్ టెక్నీషియన్‌లూ పనిచేస్తున్నారు. వీళ్లలో... దాదాపు 63 శాతం మహిళలే కావడం మరో విశేషం!

- గొర్లె బాలకృష్ణ, ఈనాడు, హైదరాబాద్



నయా ట్రెండ్

లోపలికి అడుగుపెట్టగానే నేల మీద బంగారు ధగధగలు దర్శనమిస్తే, గోడ మీది అందమైన బొమ్మలే వెలుగులు విరజిమ్మితే, కాఫీ టేబుల్ శిల్పకళతో కనువిందు చేస్తే... ఇంటి అలంకరణ అదిరిపోతుందంతే. కొత్తగా వస్తున్న ఆ ఇంటీరియర్ ట్రెండ్స్ ఏంటో మనమూ చూద్దాం పదండి!





బంగారు తివాచీ!

కాస్త విశాలమైన హాల్లో ఫర్నిచర్, ఇంటీరియర్‌లకు నప్పేలా ఒక చిన్న తివాచీ పరిచినా- మొత్తం ఆ గది లుక్కే మారిపోతుంది. అందుకే హైఫై డెకరేషన్లలో భాగంగా చాలామంది గృహిణులు ఓ చక్కని తివాచీనీ ఎంచుకుంటారు. వీటిల్లో ఇప్పటివరకూ ముచ్చటైన డిజైన్లలో పూల ప్రింట్లలో చాలా రకాలే మెప్పించాయి. త్రీడీ ఎఫెక్ట్ మ్యాట్స్ కూడా ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఇప్పుడేమో గోల్డ్ ప్రింట్లతోనూ రకరకాల కార్పెట్స్ వస్తున్నాయి. క్రిస్టల్ వెల్వెట్ మెరుపులతో దొరుకుతున్న ఈ బంగారు తివాచీలు- ఇంటి మొత్తాన్నీ గ్రాండ్‌గా మార్చేస్తాయి. రకరకాల సైజుల్లో ఆన్‌లైన్ స్టోర్లలో అందుబాటులో ఉన్నాయివి. ఇంటీరియర్లో రాజసాన్ని కోరుకుంటూ కుర్చీలూ, మంచాలూ, తలుపులూ, లైట్లూ, గోడల్లాంటివాటన్నింటికీ బంగారు వన్నెలను అద్దే మహిళలు- ఈ లగ్జరీ గోల్డ్ కార్పెట్స్‌నీ ట్రై చేయొచ్చు. ఆ అలంకరణల్ని చూసిన అతిథులు 'మీ ఇల్లు బంగారం కానూ' అని అనకుండా వెళ్లరంటే నమ్మండి!





కాంతులీనే ఆర్ట్ బొమ్మలు!

ఇల్లు చిన్నదైనా, పెద్దదైనా అభిరుచికి తగ్గట్టు గోడల మీద అందమైన మ్యూరల్స్‌తో అలంకరించుకోవడమనేది ఎవర్‌గ్రీన్ ఇంటీరియర్ ట్రెండ్. అలాగే రాత్రిపూట వెలుగు కోసం మాత్రమే పెట్టుకునే లైట్ కాస్తా ఇప్పుడు సరికొత్త అలంకరణ అయింది. ఈ రెండింటినీ ఒకటి చేస్తే అది సూపర్‌డూపర్ డెకరేషన్ అవదా అనుకున్న డిజైనర్లు- త్రీడీ మ్యూరల్స్‌లో లైట్లనీ అమర్చుతున్నారు. అందమైన ప్రకృతి దృశ్యాలూ, ఆరాధ్య దేవుళ్ల చిత్రాల్లాంటివాటినీ గోడల మీద తీర్చిదిద్ది, అవి హైలైట్ అయ్యేలా రకరకాల లైట్లనీ ఉంచుతారన్నమాట. గోడల మీద పెయింటింగ్స్, ఫొటోఫ్రేములకు బదులు ఈ లైట్ మ్యూరల్ ఆర్ట్‌ని వేయించుకున్నారంటే, ఇంటికి ఇతర హంగులూ, ఆర్భాటాల అవసరమే ఉండదు!







కాఫీ టేబుళ్లలో కట్టడాలు!

అలనాటి నిర్మాణాల్నీ, అద్భుతమైన కట్టడాల్నీ ఎంత సేపు చూసినా తనివితీరదు కొందరికి. ఆ ముచ్చటను తీరుస్తూనే చూడచక్కని ఆర్కిటెక్చర్ భవంతుల నమూనాల్ని షోకేస్‌ల్లోకి తీసుకొచ్చారు తయారీదారులు. ఇప్పుడు ఇంకో అడుగు ముందుకేసి నట్టింట్లో టీపాయ్‌కీ వాటిని జత చేశారు. రాళ్ల మీద ఆర్చ్‌ల్నీ, ద్వారాల్నీ, చక్కని శిల్పాల్నీ చెక్కుతూ వీటిని తయారుచేస్తున్నారు. కింద చూడచక్కని నిర్మాణాలపైన గాజుతో కనిపించే ఈ కాఫీ టేబుళ్లు హైటెక్ లుక్కుతోనూ ఆకట్టుకుంటాయి. కావాలంటే నచ్చిన డిజైన్ల నిర్మాణాల్నీ చేసిపెడుతున్నారు ఇంటీరియర్ ఆర్టిస్టులు. గృహాలంకరణలో వెరైటీని కోరుకునే వారికి ఈ స్టోన్ టీపాయ్స్ ఎంతగానో నచ్చేస్తాయి.







ఎటు చూసినా ప్రశ్నలే! కెరీర్‌కు సంబంధించినవి కొన్నీ, అనుబంధాలతో ముడిపడినవి కొన్నీ, ఆత్మవిశ్వాసం తాలూకు కొన్నీ! ప్రశ్నల ప్రవాహం పెరిగేకొద్దీ మనకు మనమే అపరిచితులం అవుతాం. ఎదుటి మనుషులు క్వశ్చన్ మార్కుల్లా కనిపిస్తారు. ఆ అయోమయం తొలగాలంటే... సకల ప్రశ్నలకూ కారణమైన 'మూలప్రశ్న'ను గుర్తించాలి, సరైన జవాబుతో దాని నోరు మూయించాలి. అదెలా అన్నది మరో ప్రశ్న.



మనసే... ఓ క్వశ్చన్ బ్యాంక్!

'ఈ పని నావల్ల అవుతుందా?'
'ఆ ప్రేమ నిజమైందేనా?'
'అతని స్నేహంలో స్వచ్ఛత ఎంత?'
'కొత్త కొలువులో సర్దుకుపోగలనా?'
'సొంత వ్యాపారం నడిపించగలనా?'
'నా లక్ష్యం నెరవేరుతుందా?'
...జీవితంలోని ప్రతి మలుపులోనూ ఏదో ఓ ప్రశ్న మనల్ని నిలువరిస్తుంది, నిలదీస్తుంది. ఆ లోపలి గొంతుకను బలవంతంగా నొక్కేయకూడదు. జవాబు చెప్పకుండా తప్పించుకోకూడదు. అయినా, ఎన్ని రోజులని మొహం చాటేస్తాం? ప్రశ్న అప్పులవాడి లాంటిది. ఎంతదూరం వెళ్లినా వదిలిపెట్టదు.

ప్రతి ఒక్కరూ రోజుకు వందసార్లయినా తమను తాము ప్రశ్నించుకుంటారని ఓ అంచనా. అందులో తొంభై తొమ్మిది వరకూ - కాఫీ తాగాలా, టీ తీసుకోవాలా? వెబ్ సిరీస్ చూడాలా, పుస్తకం చదవాలా? ఆఫీసుకు లంచ్‌బాక్స్ తీసుకెళ్లాలా, క్యాంటీన్‌లో తినేయాలా?... వగైరా వగైరా తేలికపాటి ప్రశ్నలే ఉంటాయి. మిగిలిన ఒక్కటి మాత్రం చాలా ముఖ్యమైంది... జయాపజయాల్ని నిర్ణయించేదీ, వ్యక్తిగత జీవితాన్ని శాసించేదీ. అందుకే దాన్ని 'మూలప్రశ్న' (కోర్ క్వశ్చన్) అంటారు.

నల్ల కళ్లద్దాలు పెట్టుకున్నప్పుడు, పట్టపగలు కూడా చీకటి అలుముకున్నట్టే ఉంటుంది. అలానే మూలప్రశ్నకు జవాబు దాటవేసినంత కాలం, నిత్య జీవితంలో ఎదురయ్యే ప్రతి సంఘటననూ దానితోనే ముడిపెట్టి చూస్తాం. 'నన్ను ఫలానా వ్యక్తి ద్వేషిస్తున్నాడేమో?' అన్నదే మన మూలప్రశ్న అయినప్పుడు... అతను ప్రేమగా మాట్లాడినా, అసూయతో రగిలిపోతున్నట్టే కనిపిస్తుంది. మనస్ఫూర్తిగా మెచ్చుకున్నా, ఎగతాళి చేస్తున్నట్టే అనిపిస్తుంది. అక్కడితో ఆగకుండా, 'నాకు ముందే తెలుసు... ఆయన అలా వ్యవహరిస్తాడని' అంటూ మనల్ని మనం మభ్యపెట్టుకుంటాం. దీన్నే 'కన్ఫర్మేషన్ బయాస్'గా వ్యవహరిస్తారు మానసిక నిపుణులు. లేనిది ఉన్నట్టు ఊహించుకోవడం దగ్గరే ఆగిపోకుండా, దానికి ఓ 'ఫేక్' ధ్రువపత్రాన్నీ ఇచ్చుకోవడం అన్నమాట. ఆ నెగెటివ్ ధోరణి మనల్ని ప్రశాంతంగా ఉండనీయదు. మనసును క్వశ్చన్ బ్యాంక్‌లా మార్చేస్తుంది. మూలప్రశ్నలోంచి అనేకానేక అనుబంధ ప్రశ్నలు పుట్టుకొస్తాయి. 'నెగెటివ్ స్పైరల్స్' అంటే ఇవే. ఇక అన్ని వైపుల నుంచీ ప్రశ్నల ముట్టడి మొదలవుతుంది.

ఇలా మొదలు...

ఓ జంట హనీమూన్‌కు వెళ్లింది. ఏ రొమాంటిక్ డిన్నర్‌కో బయల్దేరుతున్నప్పుడు, ఆ కొత్త పెళ్లికూతురు 'నేవీ బ్లూ కలర్ టీషర్ట్ వేసుకోరూ ప్లీజ్!' అని భర్తను గోముగా అడిగింది. అతను పరధ్యానంలో ఉన్నట్టున్నాడు. ఊకొట్టాడే కానీ, ఆ సంగతే మర్చిపోయాడు. ఎప్పట్లానే కుర్తా పైజమా ధరించాడు. దీంతో పడుచుపెళ్లాం మనసు చివుక్కుమంది. సరిగ్గా ఆ క్షణంలోనే 'నేనంటే ఇష్టం లేదేమో?' అనే అనుమానం కలిగిందామెకు. ఇక్కడ, ఇదే మూలప్రశ్న! అప్పట్నుంచీ భర్త ప్రతి చర్యనూ మనసులోనే ప్రశ్నించడం మొదలుపెట్టింది. 'అందుకే, షాపింగ్‌లో నాకేమీ కొనివ్వలేదేమో?', 'అందుకే, తలనొప్పిగా ఉందన్నా మాత్రలు తెచ్చివ్వలేదేమో?', 'అందుకే, ఫేస్‌బుక్‌లో నా పోస్టును లైక్ చేయలేదేమో?'... ఇలా ఆమె బుర్రలో చాలా 'నెగెటివ్ స్పైరల్స్' పోగైపోయాయి. ప్రేమయాత్ర ముగిసే సరికి అతనికి తన మీద ఏమాత్రం ప్రేమలేదనే అభిప్రాయానికి వచ్చేసింది. విడాకులు తీసుకోవాలని తీర్మానించుకుంది.

బంధాల విషయంలోనే కాదు... కొత్త ఉద్యోగంలో చేరినప్పుడూ, కొత్త బాధ్యతలు చేపట్టినప్పుడూ, కొత్త వ్యాపారం ప్రారంభించినప్పుడూ... ఇలా జీవితంలోని ప్రతి మజిలీలోనూ ఎన్నోకొన్ని సర్దుబాటు సమస్యలు ఉంటాయి. భవిష్యత్తుతో ముడిపడిన అపోహలూ, అనుమానాలూ, భయాలూ స్థిమితంగా ఉండనీయవు. అవన్నీ ప్రశ్నలుగా రూపం మార్చుకుని ప్రాణం తోడేస్తాయి. వాటిని ఆత్మవిశ్వాసంతో అధిగమించాలి. కానీ, చాలా సందర్భాల్లో అలా జరగడం లేదు. కొత్త ఉద్యోగి విషయంలో అయితే... 'నేను ఈ హోదాకు సరిపోనేమో?' అనే మూలప్రశ్నతో దాడికి రంగం సిద్ధమవుతుంది. 'అందుకే, కొలీగ్స్ నన్ను చూసి నవ్వుకుంటున్నారేమో?', 'అందుకే, బాస్ ఎవర్నో సాకుగా పెట్టి నన్ను తిడుతున్నాడేమో?', 'అందుకే, కొత్త ప్రాజెక్టులో నాకు చోటివ్వలేదేమో?'... ఇలా కుప్పలు తెప్పలుగా నెగెటివ్ స్పైరల్స్ పోగవుతాయి. పక్కవాళ్లు యథాలాపంగా నవ్వినా, దాని చుట్టూ ఓ పెద్ద కథ అల్లేసుకుంటారు. దీనికి 'టైనీ ఫ్యాక్ట్... బిగ్ థియరీ' అని పేరు పెట్టారు 'ఆర్డినరీ మ్యాజిక్' పుస్తక రచయిత గ్రెగరీ వాల్టన్. గోరంత విషయాన్ని కొండంతలు చేయడం అన్నమాట. ఆ నెగెటివ్ ఆలోచనల్లో చిక్కుకుపోయి, మన చుట్టూ ఉన్న మంచిని కూడా పట్టించుకోవడం మానేస్తాం.

మళ్లీ ఆ జంట దగ్గరికి వస్తే... నిజానికి ఆ భర్త హనీమూన్‌కు ముందూ, ఆ తర్వాత కూడా చాలాసార్లు భార్యను సంతోషపెట్టే ప్రయత్నం చేశాడు. ఆమెకు ఇష్టమని తెలిసి, వర్షంలోనే వెళ్లి ఐస్‌క్రీమ్ తీసుకొచ్చాడు,

సమాజం నుంచీ...

కొన్ని మూలప్రశ్నలకు సమాజమే మూల కారణం. 'ఇంకా కారు కొనలేదా?' అని నిలదీసినంత గట్టిగా అడుగుతుంటారు కొందరు. అప్పటి వరకూ ఆ ఆలోచనే రాకపోయినా, ఆ అవసరమే లేకపోయినా... మరుక్షణం నుంచీ కొత్త కారు గురించి ఆలోచిస్తాం. ఏదో ఓ దశలో అప్పు చేసైనా సరే కొనేస్తాం. 'ఇంకా అదే కంపెనీలోనే ఉన్నావా?', 'ఇల్లెప్పుడు కడతావ్?', 'పెళ్లెప్పుడు చేసుకుంటావ్?', 'పిల్లల గురించి ఆలోచించరా?', 'ఒకరితోనే సరిపెట్టుకుంటారా?'... ఆ ప్రశ్నాస్త్రాలకు అంతూపొంతూ ఉండదు. ఒకే ప్రశ్న పదే పదే వినిపించినప్పుడు, దాన్ని 'సామాజిక ఒత్తిడి'గా భావిస్తాం. అయిష్టంగానే అయినా తలవంచేస్తాం. కానీ, ఆ తప్పు ఎప్పుడూ చేయకూడదు. మనం సంఘ జీవులమే కానీ, సంఘానికి బానిసలం కాదు. ఇతరుల ప్రశ్నల్ని పరోక్ష కుశల ప్రశ్నలుగానే భావించాలి. అంతకు మించిన ప్రాధాన్యం అవసరం లేదు.



ఆమెకు పర్‌ఫ్యూమ్ అలర్జీ ఉందని అర్థమైపోయాక అత్తరు పూసుకోవడం మానేశాడు. కాస్తంత దృష్టి పెట్టి ఉంటే భర్త తన పట్ల చూపుతున్న ప్రేమ, శ్రద్ధ ఆమెకు అర్థమైపోయేవి. కొత్త ఉద్యోగి విషయంలో కూడా ఇలానే జరిగింది. అప్పటికే ఆ కుర్రాడు సీఈవో నుంచి రెండు అప్రిసియేషన్ లెటర్లు అందుకున్నాడు. ఓ ముఖ్యమైన మీటింగ్‌లో టీమ్ లీడర్ అందరి ముందూ ఆ జూనియర్ భుజం మీద చెయ్యేసి మాట్లాడాడు. ఒక్కసారి గతంలోని గొప్ప క్షణాల్ని నెమరేసుకుని ఉంటే... అతని బుర్రలో నెగెటివ్ ప్రశ్నలు ఆగిపోయేవి. నిత్య జీవితంలో మనం విన్నవీ, కన్నవీ, ఆలోచించినవీ... తలతో ఓ చోట పోగుపడి ఉంటాయి. ఆ డేటా ఆధారంగానే మెదడు తన 'ప్రోగ్రామ్స్'ను రాసుకుంటుంది. మనం నెగెటివ్ సమాచారాన్ని ఇచ్చి ఉంటే, అక్కడ నెగెటివ్ డేటా ఎక్కువగా ఉంటుంది. అదే మన ఆలోచనల్లో ప్రవహిస్తుంది. ప్రశ్నల్లోనూ భాగం అవుతుంది. ఆలోచనల్ని మార్చుకుంటే, మెల్లగా నెగెటివ్ ప్రశ్న కనుమరుగు అవుతుంది. అందుకు అనేక మార్గాలు.

నిజాయతీగా జవాబు...

ఆత్మవిశ్వాసం తగ్గిపోయినప్పుడూ, వైఫల్యాలు వెంటాడుతున్నప్పుడూ... సహజంగానే మూలప్రశ్న తీవ్రత పెరుగుతుంది, అనుబంధ ప్రశ్నల ఊట అధికం అవుతుంది. అలా అని, కంగారు పడాల్సిన పన్లేదు. మనసుంటే మార్గమూ ఉంటుంది. గత కొంతకాలంగా మీ బుర్రను తొలిచేస్తున్న మూలప్రశ్నను, మనసు చెవులతో శ్రద్ధగా వినండి. 'పదేపదే ఎందుకిలా అనిపిస్తోంది?' అని మిమ్మల్ని మీరు నిలదీసుకోండి. ఆ ప్రశ్నకు సవివరమైన సమాధానాన్ని ఓ కాగితం మీద రాసుకోండి. ఆ జవాబులోంచి తలాతోకాలేని ఊహల్నీ, అర్థంలేని అపోహల్నీ, నిరాధారమైన అనుమానాల్నీ ఎర్రపెన్నుతో కొట్టేస్తూ వెళ్లండి. ఈ వడపోతలో చెత్త ప్రశ్నలన్నీ గాలికెగిరిపోతాయి. ఈ అభ్యాసం పేరు 'థాట్ ఆడిట్'.

నెగెటివ్ ప్రశ్నలపైకి పాజిటివ్ ప్రశ్నలను గురిపెట్టడం మరో పద్ధతి. మనల్ని వేధించే ప్రతి ప్రశ్నలోనూ 'ఎందుకు?' అనే బలమైన మాట ఉంటుంది. కాబట్టే, 'నాకే ఎందుకు జరుగుతోంది?', 'నేనే ఎందుకు ఫెయిల్ అయ్యాను?', 'నా విషయంలోనే ఎందుకింత వివక్ష?'... ఇలా తర్జనభర్జన పడుతుంటాం చాలాసార్లు. దాన్ని 'ఎలా?' అనే శక్తిమంతమైన ప్రశ్నతో తిప్పికొట్టాలి. 'ఆ సమస్యను ఎలా పరిష్కరించాలి?', 'ఎలా చదివితే నేను పాస్ అవుతాను?', 'ఆ వివక్షను ఎలా అధిగమించగలను?'... అనే కోణంలో ఆలోచించాలి. పౌరాణిక సినిమాల్లో ఎన్టీఆర్... ప్రతినాయకుల ఆగ్నేయాస్త్రం మీద వారుణాస్త్రాన్నీ, నాగాస్త్రం మీద గరుడాస్త్రాన్నీ సంధించినట్టు! ఆ తర్వాత కూడా మూల ప్రశ్న మనసును తొలిచేస్తుంటే... దిద్దుబాటుకు సమయం వచ్చిందని అర్థం. ఆ ప్రశ్నలో భాగమైన వ్యక్తులతో మనసు విప్పి మాట్లాడాలి. అవసరమైతే క్షమించాలి, క్షమాపణలూ అడగాలి. ఆ ప్రశ్నకు కారణమైన స్వీయలోపాల్ని సరిచేసుకోవాలి... అవి నైపుణ్యానికి సంబంధించినవి కావచ్చు, వ్యక్తిత్వపరమైనవీ కావచ్చు.

శత్రువేం కాదు...

మరక మంచిదే అన్నట్టు, కొన్నిసార్లు నెగెటివ్ ప్రశ్న కొంత మేలు కూడా చేస్తుంది. స్పీడ్ బ్రేకర్‌లా మన దూకుడుకు కళ్లెం వేస్తుంది. దుందుడుకు నిర్ణయాల్ని నిరుత్సాహపరుస్తుంది. అయితే, దాని పాత్ర అంతవరకే. ఏకంగా మన ప్రయాణాన్నే అడ్డుకునేంతగా ప్రశ్నను బలపడనీయకూడదు. నిఖార్సయిన ప్రశ్న చైతన్యానికి సంకేతం. మన జీవితాన్ని స్తబ్ధత ఆవరించలేదనడానికి గుడ్డిగుర్తు. గానుగెద్దు బుర్రలో ఎలాంటి చిక్కు ప్రశ్నలూ ఉండవు. అదే రేసు గుర్రం మెదడులో గెలుపు ఓటములకు సంబంధించి రకరకాల ప్రశ్నలు గింగిర్లుకొడుతుంటాయి. నూతిలోని కప్పకు ప్రశ్న అంటేనే తెలియదు. కానీ, సముద్రంలోని చేపకు బుర్రనిండా క్వశ్చన్ మార్కులే. ఏ వైపు నుంచి ఏ మత్స్యకారుడు వల విసురుతాడో తెలియని అనిశ్చితి. కాకపోతే, ఆ ప్రశ్ననూ పరిస్థితుల్నీ మన ఎదుగుదలకు అనుకూలంగా మార్చుకోవాలి. అందులో చిటికెడు ఆశావాదాన్నీ జొప్పించాలి. 'రేపు ఉదయం పది గంటలకు నన్ను కలవండి!' అంటూ ఇద్దరు సాధారణ ఉద్యోగులకు ఓ బహుళజాతి సంస్థ యజమాని నుంచి మెయిల్ అందింది. ఎందుకు పిలిచారన్నది ఇద్దరికీ తెలియదు.

'నా వల్ల ఏదైనా తప్పు జరిగిందా? తరచూ సెలవులు పెడుతున్న విషయం పెద్ద బాస్ వరకూ వెళ్లిందా? వచ్చేనెల ఓ వెయ్యిమందిని తీసేస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది. అందులో నేనున్నానా? అదే నిజమైతే, నా భవిష్యత్తు ఏమిటి?'... ఇలా మొదటి ఉద్యోగి బుర్రనిండా నెగెటివ్ ప్రశ్నలే.

'నేనెంత అదృష్టవంతుణ్ని. పదివేలమంది ఉద్యోగులు ఉన్న కంపెనీలో, నేరుగా యజమానిని కలిసే అవకాశం ఎంతమందికి వస్తుంది? నా జీవితాన్ని మలుపుతిప్పే సంఘటన ఇది. రేపు ఆయనతో ఏం మాట్లాడాలి? కంపెనీ సేల్స్ పెరిగే మార్గాలు సూచించమని అడిగితే ఏం చెప్పాలి? కొత్త ఉత్పత్తుల మీద ఫీడ్‌బ్యాక్ ఇమ్మంటే, ఎలా స్పందించాలి?'... రెండో ఉద్యోగి ఆలోచనల్లో మాత్రం పూర్తిగా పాజిటివ్ పరిమళం.

అంతిమంగా, ఆశాజీవి ఆలోచనే నిజమైంది. అప్పటికే మానసికంగా సిద్ధపడ్డాడు కాబట్టి, చక్కటి సమాధానాలతో యజమానిని మెప్పించగలిగాడు. కొత్త

మాట సాయం..

కొన్నిసార్లు, ఏదైనా పరిష్కారం చెప్పమంటూ తమ ప్రశ్నల్ని మన ముందు ఉంచుతుంటారు బంధుమిత్రులు. ఆ సమయంలో మన పాత్ర చాలా కీలకమైంది. ఆ అభ్యర్థనను తేలిగ్గా తీసుకోకూడదు. ఎదుటి వ్యక్తిలో, రకరకాల కారణాలతో అడుగంటిపోయిన ఆశకు మళ్లీ జీవం నింపాలి. అది ఏ రూపంలో అయినా ఉండొచ్చు. వెన్నుతట్టే మాట కావచ్చు, ధైర్యాన్ని ఇచ్చే మెసేజ్ కావచ్చు. ఆ ప్రయత్నంలో మనం జీవనసారాన్ని బోధించే పుస్తకాన్ని ఇవ్వొచ్చు. స్ఫూర్తిదాయకమైన సినిమా యూట్యూబ్ లింక్‌నూ పంపొచ్చు. ఎవరికి తెలుసు, వాళ్ల ప్రశ్నకు అందులో జవాబు ఉందేమో! శాన్‌ఫ్రాన్సిస్కోలోని ఓ మానసిక వైద్యశాల గతంలో తమ దగ్గర చికిత్స తీసుకున్న రోగులకు... 'ఇక్కడంతా క్షేమం. మీరెలా ఉన్నారు? మీ కోసం మేమున్నాం? ఆ సంగతి మర్చిపోకండి' అంటూ తరచూ ఉత్తరాలు రాస్తుందట. ఆ ప్రేమపూర్వక లేఖల్ని చదివాక, ఆత్మహత్య ఆలోచనల నుంచి బయటపడ్డవారూ ఉన్నారని ఓ అంతర్జాతీయ అధ్యయనం వెల్లడించింది.



అవకాశాన్ని అందిపుచ్చుకోగలిగాడు. నెగెటివ్ ప్రశ్నలతో ఉక్కిరిబిక్కిరి అయిన మొదటి వ్యక్తికి మాత్రం నిరాశే మిగిలింది. వదిలించుకోవాలనుకున్న వెయ్యిమంది జాబితాలో అతని పేరూ కొత్తగా చేరింది. ప్రశ్నను ఓ నీటి ప్రవాహం అనుకుంటే... దాన్ని పొలం వైపు మళ్లిస్తే పంట పండుతుంది. మురికి కాలువ వైపు మళ్లిస్తే, ఇంకొంత మురుగు తయారవుతుంది.

ఎందుకొస్తాయి?

పిల్లల్ని ఏదైనా కొత్త స్కూల్‌లో చేర్పించినప్పుడు, వెళ్లేదిలేదని మొండికేస్తారు. జ్వరంగా ఉందని అబద్ధాలు చెబుతారు. క్లాస్ టీచరు తిడుతోందనో, తోటి పిల్లలు కొడుతున్నారనో లేనిపోని ఫిర్యాదులు చేస్తారు. దీనికి కారణం, 'ఈ బడితో నాకేం సంబంధం?' అనే మూలప్రశ్న. కొద్దిరోజుల్లోనే, ఆ స్కూలు వాతావరణానికి అలవాటుపడతారు. పొద్దున్నే బుద్ధిగా బయల్దేరతారు. చదువుల్లో లీనమైపోతారు. 'ఈ బడి నాదే. ఆ టీచర్లు నావాళ్లే. తోటి విద్యార్థులంతా నా స్నేహితులే' అనే భావన బలపడటమే దీనికి కారణం. ఎల్‌కేజీ రోజుల్లో బడికే వెళ్లనంటూ గుక్కపెట్టి ఏడ్చినవాడే, పదేళ్ల తర్వాత ఆ ఆవరణను విడిచిపెట్టి వెళ్తున్నందుకు... ఉద్వేగ బాష్పాలు రాలుస్తాడు. సమస్యంతా 'పరాయి' భావనతోనే! నేనూ నా ఉద్యోగం ఒకటే... నేనూ నా కంపెనీ ఒకటే... నేనూ నా జీవిత భాగస్వామీ ఒకటే - అనుకున్నప్పుడు ఏ ప్రశ్నా ఉండదు. ఉత్పన్నమైనా అది పాజిటివ్ ప్రశ్నే. పోరాడమని చెబుతుందే కానీ, పలాయనం నేర్పించదు. సకల శక్తులూ ధారపోసి అయినా సరే... బంధాన్ని నిలబెట్టుకుంటాం, లక్ష్యాన్ని ముద్దాడతాం, సవాలును స్వీకరిస్తాం.

'ఆర్డినరీ మేజిక్' పుస్తక రచయిత వాల్టన్ యూనివర్సిటీలో చదివే రోజుల్లో... వాళ్ల ప్రొఫెసర్ పుస్తక రచనకు పూనుకున్నాడు. ఆ ప్రయత్నంలో వాల్టన్ సహకారం తీసుకున్నాడు. తన పుస్తకం చేతికొచ్చాక, ఓ కాపీని వాల్టన్ చేతికి ఇస్తూ, దాని మీద 'అచ్చంగా సైకాలజిస్ట్‌లా ఆలోచించే, కాబోయే సైకాలజిస్ట్‌కు ప్రేమతో...' అని రాసి తన సంతకం చేశాడు. ఆ ఒక్క మాటా వాల్టన్‌ను చాలా ప్రభావితం చేసింది. అప్పటి వరకూ ఓ గమ్యమంటూ లేని తనకు జీవిత లక్ష్యాన్ని ఇచ్చింది. 'నేను సాధించగలనా?' అనే సందేహం ఎదురైనప్పుడు మన జీవితంలోని ప్రత్యేక సందర్భాల్ని గుర్తు చేసుకోవాలి. గత విజయాల్ని నెమరేసుకోవాలి. స్ఫూర్తి ప్రదాతల్ని తలుచుకోవాలి.

నాలాగా ఎందరో...

కొన్నిసార్లు, మన పరిధిలో లేని విషయాలు కూడా మనల్ని దెబ్బతీస్తాయి. అక్కడెక్కడో ట్రంప్ తీసుకునే నిర్ణయాలు, ఇక్కడ మన కంపెనీ మూసివేతకు కారణం కావచ్చు. అనారోగ్యాలూ, ఆత్మీయుల మరణాలూ, ప్రకృతి విపత్తులూ మన జీవితాన్ని అతలాకుతలం చేయొచ్చు. అలాంటప్పుడు, 'ఈ కష్టం నాకే ఎందుకొచ్చింది?' అని బాధపడిపోతాం. ఇది మూలప్రశ్న. ఆ వెంటనే 'నా గ్రహస్థితి బాగాలేదా?', 'ఎవరైనా కుట్రపన్నారా?', 'ఇంత ఒత్తిడిని తట్టుకోగలనా?'... ఇలా రకరకాల అనుబంధ ప్రశ్నలు చుట్టుముడతాయి. ఆ సంక్లిష్ట పరిస్థితుల్లో 'నాలాంటివాళ్లు ఎంతోమంది ఉన్నారు' అనుకోగలిగితే, మనసుకు ఉపశమనం లభిస్తుంది. అందుకే, చాలా క్యాన్సర్ ఆసుపత్రులు తమ దగ్గర చికిత్స తీసుకుంటున్న రోగులతో వాట్సాప్ గ్రూప్‌లు ఏర్పాటు చేస్తాయి. ఆ బృందంలోని సభ్యులంతా మనసు విప్పి మాట్లాడుకునే అవకాశం కల్పిస్తాయి. 'ఐ యామ్ నాట్ ఎలోన్...' ఫార్ములా రుగ్మతను ఎదిరించే ఆత్మబలాన్ని ఇస్తుంది. ఇక్కడ, క్యాన్సర్ అనేది అనివార్యమైన ప్రశ్న. దీనికి తక్షణ సమాధానం లేదు. కానీ, ఆత్మవిశ్వాసంతో ప్రశ్న తీవ్రతను తగ్గించుకోవచ్చు. మనం కొత్త ఉద్యోగి అయినప్పుడు, ఆఫీసులో మనలాంటి ట్రైనీ కుర్రాళ్లతో ఓ బృందాన్ని తయారు చేసుకోవచ్చు. మనం కొత్తగా వ్యాపారాన్ని ప్రారంభించి ఉంటే, మనలాంటి ఆంత్రప్రెన్యూర్స్‌తో ఓ వారాంతపు సమావేశం నిర్వహించుకోవచ్చు. మనం గత శ్రావణంలో పెళ్లి చేసుకున్న అమ్మాయో, అబ్బాయో అయితే... బంధుమిత్రుల్లో అదే సీజన్‌లో మనువాడిన జంటల్ని లంచ్‌కు పిలిచి మనసు విప్పి మాట్లాడుకోవచ్చు. ఆ చిన్నపాటి ప్రయాణంలో ఎదురైన కష్టనష్టాలను అందరూ పంచుకోవచ్చు. ఆ అనుభవాలు కొత్త బలాన్ని ఇస్తాయి. మనల్ని మనం సరిచేసుకునే అవకాశాన్నీ కల్పిస్తాయి.

★ ★ ★

చీకటి రెండు రకాలు.

ఒకటి ... దీపాలు ఆర్పేసీ, తలుపులు మూసేసీ మనంతట మనమే సృష్టించుకునేది. ఆరిపోయిన దీపాల్ని వెలిగించీ, మూసేసిన తలుపులు బార్లా తెరిచీ... మన కారణంగా ఏర్పడిన చీకటిని మనమే తొలగించుకోవచ్చు.

రెండు... రాత్రి అయిపోగానే, మన ప్రమేయం లేకుండానే పరిసరాల్ని ఆవరించే సహజమైన చీకటి. ఈ విషయంలో మనం అస్వతంత్రులం. ప్రకృతి సిద్ధమైన చీకటిని, ప్రకృతి మాత్రమే తొలగించగలదు.

ప్రశ్నలూ అంతే. మనం సృష్టించుకున్న ప్రశ్నలకు మనమే జవాబు కనిపెట్టాలి. దీనికి స్వయంకృషి అవసరం. కాలం సృష్టించిన ప్రశ్నలకు కాలమే జవాబు చెబుతుంది. ఇక్కడ ఆశావాదం ముఖ్యం. ★



నెలల పిల్లలప్పుడే ఫార్ములా ఫుడ్ తినిపిస్తున్నాం. అఆలూ రాకముందే 'ఆలూ చిప్స్' అనిపిస్తున్నాం. రైమ్స్ నేర్వకముందే 'చాకోబికీస్' కోసం ఉవ్విళ్లూరేలా చేస్తున్నాం. ఎత్తు పెరగడానికి హెల్త్ డ్రింకూ, అరుగుదల కోసం బ్రౌన్ బ్రెడ్డూ అంటూ ఏవేవో అందిస్తున్నాం! వీటివల్ల... నేటి పిల్లల్లో మధుమేహం పెరుగుతోందట! అందుకే ఈ బ్రాండ్‌లపైన సమరం చేస్తున్నాడతను. నెలకు పాతిక లక్షల వేతనం వచ్చే ఉద్యోగాన్ని వదులుకుని మరీ దేశంలో ఓ కొత్త ఉద్యమాన్ని తెచ్చాడు రేవంత్ హిమత్‌సింగ్‌కా! అదేమిటో మనం తెలుసుకోవాల్సిందే...



ఆ చిరుతిళ్లతో... పిల్లలకు మధుమేహం!

రేవంత్ హిమత్‌సింగ్‌కాది కోల్‌కతా. నాన్న వ్యాపారి... ఉన్నత మధ్యతరగతి కుటుంబం. ఇండియాలో ఇంటర్ చదివాక ఎన్నో కలలతో అమెరికా వెళ్లాడు రేవంత్. తన స్వప్నాలని మించే సాధించాడు. ఎంబీఏ చదివి మెకిన్సీ అండ్ కంపెనీలో కన్సల్టెంట్‌గా ఉద్యోగం సాధించాడు... ఏడాదికి మూడుకోట్ల రూపాయలు జీతం. మూడేళ్లపాటు పనిచేశాడు. అప్పుడు కాస్త అనారోగ్యానికి గురైతే... న్యూట్రిషన్ కోర్సు ఒకటి చదివాడు. ఆ అవగాహనతో అమెరికాలోని ప్యాకేజ్డ్ ఆహార ఉత్పత్తుల్ని పరిశీలించసాగాడు. 'పైన ఆర్గానిక్ అని ఉన్నా... లోపల మామూలువే ఉండేవి. వినియోగదారుల హక్కులపైన ఎంతో చైతన్యం ఉన్న అమెరికాలోనే ఇలా ఉంటే... భారత్ పరిస్థితి ఏమిటని చూశాను. ముఖ్యంగా పిల్లల కోసమని మార్కెట్లోకి వచ్చిపడే ఉత్పత్తుల్లో మిగతా దేశాల్లో నిషేధించిన పామాయిల్, చక్కెర, టైటానియం డై ఆక్సైడ్ వంటి కృత్రిమ రంగులూ యథేచ్ఛగా వాడటం గమనించాను. 'రేపు మనం భారతదేశంలో స్థిరపడి... మనకీ పిల్లలు పుడితే ఇవే తింటారేమో' అంటుండేది నా భార్య. ఇది ఇలాగే సాగకూడదని అనుకున్నాను. ఉద్యోగానికి రాజీనామా చేసి భారత్‌దేశానికి వచ్చాను' అని వివరిస్తాడు రేవంత్. కాకపోతే అతను వచ్చిన నెలకే కోర్టుల చుట్టూ తిరగాల్సి వచ్చింది...



తొలి విజయం...

రేవంత్ భారతదేశానికి రాగానే 'బోర్న్‌విటా'ని విమర్శిస్తూ వీడియో ఒకటి పెట్టాడు. అందులో 50 శాతం చక్కెరే ఉందంటూ... అందుకు సాక్ష్యంగా ప్యాక్ వెనక ఇచ్చిన వివరాలని చూపించాడు! 'ఇది తాగితే పిల్లలకి వచ్చేది ఆరోగ్యం కాదు... మధుమేహం' అని వ్యాఖ్యానించాడు. ఆ సంస్థ వెంటనే లీగల్ నోటీసు పంపించింది. ఈ వ్యవహారం మీడియాకి తెలిసి పెద్ద వార్తయ్యింది... దాంతో నేషనల్ చైల్డ్‌రైట్స్ కమిషన్(ఎన్‌సీఆర్‌సీ) రంగంలోకి దిగి, క్యాడ్‌బరీస్ సంస్థ చక్కెరశాతాన్ని తగ్గించాల్సిందేనని ఆదేశించింది. దిగివచ్చిన క్యాడ్‌బరీస్ సంస్థ బోర్న్‌విటాలో చక్కెరని 15 శాతం తగ్గించింది. మరోవైపు కేంద్రప్రభుత్వం కూడా బోర్న్‌విటా, హార్లిక్స్ వంటివాటిని 'హెల్త్‌డ్రింక్స్' కింద చూపించకూడదంటూ ఆదేశాలు జారీ చేసింది. రేవంత్ అందుకున్న తొలి విజయం ఇది. ఇక వరసగా 'ఫుడ్ ఫార్మర్' పేరుతో ఇలాంటి వీడియోలే చేయడం మొదలుపెట్టాడు. నెలల పిల్లలకి ఇచ్చే 'ఫుడ్ ఫార్ములా' తయారీలో చక్కెర వాడకూడదు... వాటిని ఉత్పత్తిచేసే ఓ బహుళజాతి సంస్థ అమెరికా యూరప్‌లలో దాన్ని నిక్కచ్చిగా పాటిస్తోంది. కానీ భారతదేశంలో మాత్రం యథేచ్ఛగా చక్కెరని వాడుతోంది... ఈ ద్వంద్వవైఖరి ఏమిటని ప్రశ్నించాడు రేవంత్. అతనితోపాటు పలు ఎన్జీఓలూ దీనిపైన గొంతు విప్పితే... దిగివచ్చిన ఆ సంస్థ ఇక్కడా చక్కెరలేని ఉత్పత్తుల్ని తీసుకొచ్చింది. పెప్సికో సంస్థ తయారుచేసే 'లేస్'లో- భారత్‌లాంటి దేశాల్లో పామ్ ఆయిల్‌ను వాడుతోంది! రేవంత్ వీడియోలతో... ఆ సంస్థా దశలవారీగా సన్‌ఫ్లవర్ ఆయిల్‌కి మారింది. ఈ మధ్యే సన్‌ఫీస్ట్ సంస్థ... తమ బిస్కెట్‌లని లంచ్‌బాక్స్‌కి ప్రత్యామ్నాయంగా చూపిస్తూ ఓ యాడ్ ఇచ్చింది! 'అదెలా... మీ బిస్కెట్‌లలో 80 శాతం మైదా, చక్కెరలే ఉన్నాయి. లంచ్‌కి బదులు రోజూ పిల్లలు అవి తింటే ఏమన్నా ఉందా?' అని తీవ్రంగా విమర్శిస్తే వెంటనే ఆ యాడ్‌ని తీసేసిందా సంస్థ! ప్రస్తుతం యూట్యూబ్‌లో రేవంత్‌కి మూడుకోట్లమంది సబ్‌స్క్రైబర్లున్నా... మేం యాడ్ ఇస్తామంటూ ఎన్నో సంస్థలు పోటీపడుతున్నా... వాటితో ఒక్కపైసా కూడా లాభం తీసుకోవట్లేదు రేవంత్.

ఊరూరా ప్రచారం...

గత ఏడాది... 'ప్రతి స్కూల్‌లోనూ షుగర్ బోర్డు ఏర్పాటుచేయాలి. నేటి పిల్లలు ఇష్టపడుతున్న చాక్లెట్‌లూ, బిస్కెట్‌లలో ఎంత చక్కెర ఉంటుందో వెనక ఉన్న ఇన్‌గ్రీడియంట్స్‌ని చదివి వాళ్ల చేతే రాయించాలి' అని పిలుపునిచ్చాడు రేవంత్. వెంటనే ఎన్‌సీఆర్‌సీ స్పందించింది. 'ఔను... మనదేశంలో ఎంతో మంది పిల్లలు టైప్-2 డయాబెటిస్‌తో బాధపడటానికి ఈ ఆహారపు అలవాట్లే కారణం' అంటూ సీబీఎస్‌ఈకి లేఖ రాసింది. దానిపైన స్పందించిన సీబీఎస్‌ఈ ప్రతి స్కూల్లోనూ షుగర్‌బోర్డు ఉండాలంటూ నోటీసులు జారీ చేసింది. హైదరాబాద్‌లాంటి చోట్ల స్టేట్ బోర్డు స్కూళ్లు కూడా ఇలాంటి బోర్డుల్ని ఏర్పాటుచేశాయి. ఈ మధ్యే- ఏదైనా వస్తువు కొనేముందు ప్రతి ఒక్కరూ ప్యాక్ వెనకాలున్న ఇన్‌గ్రీడియంట్స్ వివరాల్ని చదివి తీరాలి అంటూ 'లేబుల్ పఢేగా భారత్' అనే ప్రచార ఉద్యమాన్నీ మొదలుపెట్టాడు. ఈ ప్రభావాన్ని చూసే... ఫోర్బ్స్ ఇండియా సంస్థ తన 'భారత డిజిటల్ స్టార్' జాబితాలో రేవంత్‌కి స్థానం కల్పిస్తే... ది బెటర్‌ఇండియా సంస్థ ఇటీవలే 'ఛేంజ్ మేకర్' అవార్డునీ అందించింది! ★



తేనె, నెయ్యి, నూనె...
అన్నీ పొడి రూపంలోనే!

'అమ్మా! వేడి నీళ్లలో ఒక స్పూన్ తేనె వేయమంటే ఏదో పొడి వేస్తున్నావేంటీ' ప్రశ్నించింది గీత. 'హాస్టల్‌కి తీసుకెళ్లేందుకు నెయ్యి కావాలంటే ఇదేదో పౌడర్ ప్యాకెట్ తీసుకొచ్చావేంటీ' అంటూ కాస్త ఆశ్చర్యపోయి నాన్నను అడిగింది రమ. అవును మరి... రకరకాల ఆహారపదార్థాలే కాదు, ద్రవరూపంలో ఉండే తేనె, నెయ్యి, నూనెల్లాంటివెన్నో కూడా పొడి రూపంలో వచ్చేస్తున్నాయిప్పుడు. అసలు ఇవన్నీ ఈ సరికొత్త అవతారంలోకి ఎందుకు మారుతున్నాయో, వీటి వల్ల లాభాలేంటో తెలుసుకుందామా!



పద్ధతి పాతదే అయినా ఉపయోగకరంగా ఉంటే- అందులోనే కొత్త టెక్నాలజీని వాడుతూ ఈతరానికీ తగ్గట్టుగా మార్చేయడం అనేది ప్రతి దాంట్లోనూ చూస్తున్నాం. అదే సూత్రాన్ని ఫుడ్‌లోనూ పాటిస్తూ రకరకాల ట్రెండ్స్‌నీ తీసుకొస్తుంటారు మాస్టర్ షెఫ్‌లు. అందులో భాగంగానే వివిధ పదార్థాలకు పొడి రూపాన్ని తెచ్చే ట్రెండ్ మొదలైంది. బియ్యంలా- జొన్నలూ, రాగులూ, సజ్జల వంటి తృణధాన్యాల్ని కూడా రోజూ తినడానికి వాటిని పొడుల్లా ఆహారపదార్థాల్లోకి చేర్చడం ఎప్పటి నుంచో ఉన్నదే. ఏ కాలాల్లోనైనా వాడుకునేలా కూరగాయల్ని ఎండబెట్టి ఒరుగుల్లా చేసుకోవడమూ తెలిసిందే. సులువుగా ఆహారంలో చేర్చుకునేలా, అందుబాటులో లేనప్పుడు వాడుకునేలా ఈ పద్ధతులు ఎంతగానో ఉపయోగపడతాయి. ఆ వెసులుబాటును పండ్లూ, కూరగాయలూ, ఆకుకూరలకూ తీసుకొస్తే ఇంకాస్త ప్రయోజనకరంగా ఉంటుందనే ఆలోచనతో ఫ్రూట్, వెజిటబుల్ పౌడర్స్‌ని తయారుచేశారు. ఇంకా చికెన్, ఎగ్ లాంటి వాటినీ పొడుల్లా మార్చారు. ఇవి వంటల్లో వేయడానికీ, తినడానికీ ఎంతో వీలుగా ఉండటంతో ఫుడ్ మేకర్లు ఎప్పటికప్పుడు మరిన్ని కొత్త ప్రయోగాలూ చేస్తున్నారు. అలా ఇప్పుడు ద్రవ పదార్థాల్నీ పొడుల్లా తయారుచేస్తున్నారు.

ఏయే పదార్థాలు...

నెయ్యి ఘుమఘుమలు వంటకానికి సరికొత్త రుచిని తీసుకొస్తుంటాయి. పిల్లలకే కాదు, ఆ ఫ్లేవర్ పెద్దలకూ నచ్చేస్తుంది. అందుకే ప్రతి ఒక్కరూ విరివిగా వాడే నెయ్యిని పొడిగా మార్చారు. ఇంకా పొద్దుతిరుగుడు, సోయా, కొబ్బరి, ఆలివ్ ... ఇలా ఎన్నో నూనెలూ పొడుల్లా దొరుకుతున్నాయి. తేనె, పెరుగూ, కొబ్బరినీళ్ల పౌడర్లూ వస్తున్నాయి. అసలేంటీ వీటి వల్ల లాభం అంటే... పదార్థాల పోషకాల్ని సులువుగా ఆహారంలోకి చేర్చుకోవడానికి ఈ పొడి రూపం సరిగ్గా సరిపోతుంది. అంతేకాదు, దీన్ని ఎక్కువ కాలం నిల్వ చేసుకోవచ్చు కూడా. ఒలికిపోతుందన్న భయం లేకుండా ప్రయాణాల్లో హాయిగా తీసుకెళ్లొచ్చు. తడి లేకుండా ఆ పదార్థాల ఫ్లేవర్ కావాలనుకున్నా ఇవి సరైన ఎంపిక.

మామూలుగా ఆ పదార్థాల పొడుల కన్నా ఎనర్జీ, హెల్దీ ఫ్యాట్స్‌తో ఉండే ఆయిల్స్ మన శరీరానికి చాలా అవసరం. అందుకే ప్రత్యేకంగా నూనెల నుంచే పొడుల్ని తీసుకొస్తున్నారన్నమాట. ఈ ఆయిల్ పౌడర్స్‌ని ముఖ్యంగా సలాడ్లూ, ప్రొటీన్ షేక్స్, ఇన్‌స్టంట్ ఫుడ్ ఐటమ్స్‌లో ఎక్కువగా వాడుతుంటారు. ఇంకా ఎనర్జీ బూస్టర్‌గా చెప్పే కొబ్బరి నీళ్లను ఎప్పుడైనా తాగాలంటే కోకోనట్ పౌడర్ ఇంట్లో ఉంచుకుంటే సరి, నీళ్లు కలుపుకుని క్షణాల్లో కొబ్బరినీళ్లను తయారుచేసుకోవచ్చు. బేకింగ్ ఐటమ్స్, స్వీట్లూ, బిర్యానీ లాంటి వంటకాల మిక్సింగ్‌లో పెరుగు, తేనె పొడులు ఎంతో వీలుగా ఉంటాయి. కొన్ని టీ, కాఫీ పౌడర్లూ తేనె పొడితో కలిపి వస్తున్నాయి. వీటితోపాటు వివిధ సౌందర్యోత్పత్తుల్లోనూ పొడి రూపంలో ఉన్న ఈ పదార్థాల్ని వినియోగిస్తున్నారట!

ఎలా చేస్తారు?

పోషకాలు ఏమాత్రం తగ్గకుండా కూరగాయల్నీ, పండ్లనీ పొడిరూపంలోకి మార్చినట్టే వీటినీ చేస్తున్నారు. అయితే ఇవి ద్రవ పదార్థాలు కాబట్టి స్ప్రే డ్రైయింగ్ పద్ధతిని ఎక్కువగా ఉపయోగిస్తున్నారు. దీంట్లో పదార్థాల్ని స్ప్రే చేస్తూ, హాట్ ఎయిర్‌తో పూర్తిగా తేమను తొలగించి, పొడిలా మార్చేస్తారు.

మరెందుకాలస్యం... అసలు పదార్థాల సారంతోపాటు వాటి రుచినీ, వాసనల్నీ అందిస్తూనే వాడుకోవడంలోనూ ఎంతో సౌలభ్యాన్ని తెస్తున్న ఈ లిక్విడ్ పౌడర్స్‌ని మీ వంటగదిలోనూ భాగం చేసేయండి! ★



అవీ ఇవీ

ఫొటోలోనే వీడియో చూద్దాం!



మాంగల్యధారణ ఘట్టం పెళ్లిపుస్తకంలో ఎప్పటికీ మరిచిపోలేని అనుభూతే. పాపాయిల బుజ్జి బుజ్జి మాటలు ఎప్పుడు గుర్తొచ్చినా సంబరమే. స్నేహితులతో చెప్పుకున్న కబుర్లు కలకాలం మధురమే! ఆ జ్ఞాపకాలన్నింటిని కేవలం ఫొటోల్లో చూసి మురిసిపోవడమేనా... కావాలనుకున్నప్పుడల్లా కళ్ల ముందుకు ఆ క్షణాల్నీ తీసుకొచ్చేలా ఉంటే, ఎంత బాగుంటుందో కదూ! ఆ వెసులుబాటునే తీసుకొచ్చింది 'మెమరిస్‌ఏఆర్' అనే సంస్థ. ఫొటోల్లోనే ఆ తీపిగుర్తుల తాలూకు వీడియోల్నీ చూసేలా ఫొటో ఆల్బమ్స్‌ని తయారుచేసి ఇస్తోంది. వాళ్ల వెబ్‌సైట్‌కి వెళ్లి ఫొటోలూ, వీడియోలూ అప్‌లోడ్ చేస్తే, ఏఆర్ టెక్నాలజీ సాయంతో- ఫొటోని స్కాన్ చేస్తే వీడియో వచ్చేలా మారుస్తోంది. దీంట్లో ఒక్క ఫొటో ఉన్న ఫ్రేమ్ దగ్గర్నుంచీ నచ్చినన్ని ఫొటోలు కలిపిన ఆల్బమ్ వరకూ కస్టమైజేషన్ ఆప్షన్ ఉంది. ప్రియమైన వారిని ఆశ్చర్యపరచాలన్నా... ఇష్టమైనవారితో గడిపిన క్షణాల్ని పదిలపరుచుకోవాలనుకున్నా... ఈ నయా ఫొటో వీడియో ఆల్బమ్‌ను ప్రయత్నించొచ్చు!

పంటి మీద టాటూ!

ఇష్టమైన వాళ్ల దగ్గరకు వెళ్లి 'హ్హి హ్హి హ్హి' అంటూ పళ్లు చూపించి విభిన్నంగా తమ మనసులోని ప్రేమను చూపిస్తున్నారు కొంతమంది. నవ్వితే ప్రేమ కనిపించడం ఏంటీ అంటే... దంతాల మీద నచ్చిన టాటూలు వేయించుకుని ప్రియమైనవారి మనసుదోచే ప్రయత్నం చేస్తున్నారు మరి. మొన్నమొన్నటి వరకూ ఒంటి మీద కనిపించిన టాటూల ట్రెండ్ ఇప్పుడు పంటి మీదకూ చేరిపోయింది. డెంటల్ టాటూ పేరుతో అమెరికా, జపాన్, చైనా... తదితర దేశాల్లో ఈ ట్రెండ్‌ను ఎక్కువగా ఫాలో అవుతున్నారు. దంతాల మీద డిజైన్లు ఎలా వేస్తారోనని ఊహించుకోవడానికే కష్టంగా అనిపిస్తుంది కదా. అయితే ఈ టాటూల్ని నేరుగా పళ్ల మీద వేయరండోయ్. పళ్లకు తగ్గ టీత్ క్రౌన్స్ తయారుచేసుకుని, వాటిమీద రకరకాల బొమ్మల్ని వేయించుకుని పంటికి తొడిగేస్తారు. కొందరు ఒకటి, రెండు పళ్ల మీద టాటూలు వేసుకుంటే, మరికొందరు కనిపించే దంతాలన్నింటినీ టాటూలతో నింపేస్తున్నారు. వెర్రి వెయ్యి విధాలు అంటే ఇదేనేమో!





ఈ ల్యాపీ ఎంతో స్మార్ట్ గురూ!

స్పేస్‌టాప్-జీ1... ఈతరం సూపర్ ల్యాప్‌టాప్. ట్యాబ్ కన్నా కాస్త పెద్ద సైజులో ఉండే ఈ ల్యాప్‌టాప్‌లో స్క్రీన్ అసలే ఉండదు. 'మరైతే తెర లేకుండా పని ఎలా చేసుకుంటారు' అంటారేమో. అసలు విషయం ఏమిటంటే... చూడ్డానికి ఎలాంటి స్క్రీన్ ఉండదు కానీ... దీనికి అనుసంధానించిన ఏఆర్ గ్లాసెస్‌ను పెట్టుకున్నారంటే- కళ్ల ముందు వర్చువల్ తెర ప్రత్యక్షం అవుతుంది. దాదాపు వంద అంగుళాల వరకూ తెరను ఏర్పాటు చేసుకోవచ్చు. అంతేకాదు, అలా ఒకేసారి నాలుగైదు వర్చువల్ స్క్రీన్లనీ సృష్టించుకుని, వేరు వేరు ట్యాబుల్లో పనిచేసుకోవచ్చు. టెక్ యుగంలోని ఈ సరికొత్త గ్యాడ్జెట్ వల్ల బోలెడన్ని లాభాలూ ఉన్నాయి. దీన్ని ఎక్కడికైనా సులువుగా పట్టుకెళ్లొచ్చు, ఇంకా వర్క్ చేస్తున్నప్పుడు మనకు తప్ప ఇతరులెవరికీ అది కనిపించదు కూడా.





అరచేతిలో అకౌంట్!

సూపర్ మార్కెట్లో సరకుల్ని తీసుకుని అక్కడ చెయ్యి చూపితే చాలు, పేమెంట్ అయిపోతుంది. రెస్టరంట్లో ఫుడ్ తినేసి అరచేతిని చూపించి డబ్బులు కట్టేస్తున్నారు. అబ్రకదబ్ర అంటూ మాంత్రికుడు అరచేతిల్లోంచి పావురాలూ, పువ్వులూ తీసినట్టే ఇదీ ఏమైనా మ్యాజిక్కేమో అనుకుంటున్నారు కదూ! కానీ ఇందులో మాయా లేదు, మంత్రం లేదు, ఉన్నది టెక్నాలజీ మాత్రమే. అవునండీ... క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి మన అకౌంట్లోని డబ్బుల్ని ఇతరుల అకౌంట్లోకి పంపినట్టే ఇది కూడా. అయితే ఫోన్‌తో పని లేకుండా కేవలం మన అరచేతితోనే అంతా అయిపోతుంది. ఒక్కో వ్యక్తికీ భిన్నంగా ఉండే అరచేతిని స్కాన్ చేసి అకౌంట్‌కి లింక్ చేస్తారు. పామ్ స్కాన్ డివైజ్ దగ్గర చెయ్యిని ఉంచగానే సెన్సర్ దాన్ని రిజిస్టర్డ్ డేటాతో మ్యాచ్ చేస్తుంది. రెండూ ఒకేలా ఉంటే పేమెంట్ అయిపోతుందన్నమాట. ఇప్పటికే ఈ హ్యాండ్ స్కాన్ టెక్నాలజీని చైనాలో రెస్టరంట్లూ, మెట్రో స్టేషన్లూ, సూపర్ మార్కెట్లలో వాడటం మొదలుపెట్టేశారు!





ఆసుపత్రి ఆలయంలా...

ఆసుపత్రుల్లోని రోగులు- త్వరగా జబ్బు నయం అయి ఇంటికి వెళ్లిపోవాలంటూ తమ ఇష్టదైవాల్ని వేడుకుంటారు. ఇంట్లోవాళ్లూ గుడికి వెళ్లి దండం పెట్టుకుంటారు. ఇది ఎక్కడైనా కనిపించేదే! కానీ ఓ ఆసుపత్రినే దేవాలయంగా మార్చడం ఎక్కడైనా చూశారా? చెన్నైలోని 'సవిత డెంటల్ కాలేజీ అండ్ హాస్పిటల్'కి వెళితే ఆ చిత్రాన్ని చూడొచ్చు. లోపలికి స్వాగతం పలికే ఆర్చ్ దగ్గర్నుంచీ ఆసుపత్రి గోడలూ, స్తంభాల నిర్మాణం వరకూ అంతా దేవుళ్ల విగ్రహాలతో, అద్భుతమైన శిల్పకళానైపుణ్యంతో కనువిందు చేస్తాయి. మహా ద్వారం మీదున్న విగ్రహాల మీద స్టెతస్కోప్, ఇంజెక్షన్ల నమూనాల్నీ తీర్చిదిద్దారు. ఇంకా లోపల నిలువెత్తు మురుగన్ విగ్రహమూ దర్శనమిస్తుంది. ఇంతకు ముందు ఇదీ మామూలు ఆసుపత్రుల్లానే ఉన్నా- హాస్పిటల్ అంటే కలిగే భయాన్ని తగ్గించాలనే, యాజమాన్యం ఈ సరికొత్త ఆలోచన చేసి, దీనికి ఈ ఆధ్యాత్మిక శోభను తీసుకొచ్చింది. బయట నుంచి దేవాలయంలా కళకళలాడే ఈ ఆసుపత్రి లోపల మాత్రం అన్ని ఆసుపత్రుల్లాగే- చికిత్సకు అవసరమైన సదుపాయాలతో ఉంటుంది.

బ్యాగు హుడీ!

బయటకు వెళ్లినప్పుడు కుర్రకారు చిన్నబ్యాక్‌ప్యాక్ అయినా తగిలించుకుని వెళుతుంటారు. ఫోన్ ఛార్జర్, వాటర్ బాటిల్, బుక్, పెన్... ఇలా అత్యవసర వస్తువుల్ని బ్యాగులో పెట్టుకుని పట్టుకెళ్తుంటారు. అదే బ్యాక్‌ప్యాక్- హుడీ, జాకెట్ లాంటిదానికే జతగా వస్తే? విడిగా బ్యాగుతో పనే ఉండదు కదా. డిజైనర్లకు ఆ ఆలోచనే వచ్చినట్టుంది, ట్రావెల్ హుడీ బ్యాక్‌ప్యాక్‌ని తయారుచేశారు. చలికాలంలో, ప్రయాణాల్లో ఈ హుడీ బాగా ఉపయోగపడుతుంది. ఇందులో పెద్దవాళ్లకూ, పిల్లలకూ తగ్గ సైజులూ అందుబాటులో ఉన్నాయి!



ఇవి గ్లాస్ టాయిలెట్స్!

పబ్లిక్ టాయిలెట్లోకి అంత సులువుగా వెళ్లలేం. లోపల శుభ్రంగా ఉందో లేదో అనే సందేహంతో తప్పనిసరైతే తప్ప ఆ చుట్టుపక్కల అడుగుపెట్టం. కానీ జపాన్‌లో ఆ సమస్యకు పరిష్కారం చూపిస్తూ పార్కుల్లో ట్రాన్స్‌పరెంట్ టాయిలెట్లను ఏర్పాటుచేశారు. లోపల ఎలా ఉందో స్పష్టంగా కనిపించేలా పారదర్శకమైన గాజు గోడలతో కట్టారన్నమాట. 'బయటి నుంచి కనిపించడం బాగానే ఉంది కానీ లోపలికి వెళ్లిన వాళ్లూ అందరికీ కనిపిస్తారు కదా, బాబోయ్ ఇవేం టాయిలెట్స్' అంటారేమో... అక్కడే ఉంది ఒక చిన్న టెక్నాలజీ. ప్రత్యేకమైన స్మార్ట్ గ్లాస్‌తో నిర్మించిన వీటిల్లో లోపలికి వెళ్లి డోర్ లాక్ చేయగానే గాజు మసగ్గా మారిపోతుంది. దీంతో లోపలున్న వాళ్లు బయటకి అస్సలు కనిపించరు. మళ్లీ అన్‌లాక్ చేసి తలుపు తెరిస్తేనే గాజు పారదర్శకమైపోతుంది. అంతేకాదు, ఈ గాజు డబుల్ షేడ్స్ వల్ల లోపల ఎవరైనా ఉన్న విషయం చూసేవాళ్లకూ అర్థమవుతుంది. పబ్లిక్ టాయిలెట్స్ కూడా శుభ్రంగా ఉంటాయన్న నమ్మకాన్ని ప్రజల్లో తేవాలనే ఉద్దేశంతోనే ఈ ఆలోచన చేశారట.





వర్షం పడితే రంగుల బొమ్మలు

ఓ మోస్తరుగా వర్షం కురిసినా రోడ్ల మీద పెద్ద పెద్ద గుంతలూ, మూతలు తెరిచిన డ్రైనేజీలూ కనిపిస్తుంటాయి. కానీ దక్షిణ కొరియాలోని సియోల్ వీధుల్లో మాత్రం... వానజల్లు మొదలవ్వగానే రోడ్ల మీద అందమైన తాబేళ్లూ, చేపలూ, సీతాకోక చిలుకలూ... చూడచక్కని ఆర్ట్ దృశ్యాలూ బయటకొస్తాయి. ప్రజల్ని ఆకట్టుకోవడానికి వినూత్నంగా రోడ్ల మీద ఈ వెరైటీ ప్రయోగం చేశారట. నీళ్లు పడితేనే కనిపించే హైడ్రోక్రోమిక్ పెయింట్లతో రకరకాల బొమ్మల్ని వేశారు. మామూలప్పుడు సాదాగానే ఉన్నా తడి తగిలితే మాత్రం ఆ పెయింట్ బయటకు కనిపిస్తుందన్నమాట. ఒక వైపు వానజల్లుల్ని ఎంజాయ్ చేస్తూనే, మరోవైపు రోడ్ల మీది ముచ్చటైన చిత్రాల్ని చూస్తూ వెళుతుంటారు స్థానికులంతా!



కథ

"కాస్త కూడా నమ్రతా మర్యాదా లేదమ్మా... ఎలా పెంచుతారో ఏమో. అడిగిన దానికి పుల్ల విరిచినట్లు సమాధానాలు చెప్తుంటారు ఈ కాలం పిల్లలు. ఏం నేర్చుకుని వస్తారో" మూతి మూడు వంకర్లు తిప్పుతూ జనాంతికంగా మాట్లాడుతోంది మహలక్ష్మమ్మ.

"ఎవరినే అమ్మా... శ్లేషార్థాలతో ఆడుకుంటున్నావు?" అప్పుడే ఇంట్లోకి వచ్చిన కొడుకును చూసి గతుక్కుమంది మహలక్ష్మమ్మ.

"శృతిని గురించిలేరా... ఏదో గుర్తుకువచ్చి అనుకుంటున్నాను."

"సరేలే, ఎవరి గురించి అయితే నాకెందుకుగానీ నా కాఫీ నాకిచ్చెయ్" నాటకీయంగా అంటూ తన రూములోకి వెళ్ళాడు.

మంచంమీద కూర్చున్న స్వాతి కళ్ళలో నీళ్ళు ఉబుకుతున్నాయి. సుధీర్‌ను చూసి ముఖం పక్కకు తిప్పుకుంది కన్నీళ్ళు కనిపించకుండా.

సుధీర్ ఫ్రెష్ అయి వచ్చి స్వాతికి ఎదురుగా కూర్చున్నాడు. చుబుకం పట్టి బతిమాలుతూ, "అమ్మ మాటలు పట్టించుకోకు స్వాతీ. ఆవిడ ఎప్పుడూ ఎదుటివారిని ఏదో ఒకటి అంటూనే ఉంటుంది. నిజంగా నీలో తప్పు ఉండికాదు. అనడం ఆమె మానియా... అంతే. అందుకే నువ్వు పట్టించుకోవద్దు అంటాను."


తలూపి కళ్ళు తుడుచుకుని లేచింది స్వాతి. స్వాతి పెద్ద కలివిడిగా ఉండదు. అడిగిన వాటికి సమాధానాలు చెబుతుంది. చొచ్చుకుపోయి గలగల మాట్లాడటం చేతకాదు. అన్ని పనులూ వచ్చు. తన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తిస్తుంది. ఎవరైనా అనవసరంగా మాట అంటే చాలా రోషపడుతుంది, బాధపడుతుంది. పుట్టింట్లో కూడా అంతే. ఊహ తెలిసినప్పటినుండి అమ్మానాన్నల చేత ఒక్క మాట కూడా అనిపించుకోలేదు. పద్ధతిగా ఉంటుంది. అందరూ 'స్వాతి బంగారు తల్లి, స్వాతిముత్యమే' అంటారు. మితభాషి. తనకు నచ్చితే స్మితభాషి కూడా.

పెళ్ళయి నాలుగు నెలలు అవుతోంది. సుధీర్ సాఫ్ట్‌వేర్ కంపెనీలో జాబ్ చేస్తాడు. స్వాతికి బీటెక్ అయిపోగానే మంచి సంబంధం అని పెళ్ళి చేశారు. సుధీర్‌కు ఒక తమ్ముడు, చెల్లి. 'ఉద్యోగం ఇష్టముంటే చెయ్యి, లేకపోతే బలవంతం లేదు' అన్నారు. అత్తారింటికి వచ్చిన రెండు నెలల్లోనే అత్త చుక్కలు చూపిస్తోంది. ఏదో ఒక వంక పెట్టి సూటిపోటి మాటలంటుంది. తనను పరోక్షంగా అంటుంది. కూతురు శృతినైతే డైరెక్టుగానే వాయిస్తుంటుంది. ఆ పిల్ల లెక్క చెయ్యదు. ఎక్కడివక్కడ వదిలేసి పోతుంటుంది. స్వాతి ఇల్లంతా నీట్‌గా సర్ది పెడుతుంటుంది. శృతికి- వదిన స్వాతి అంటే చాలా ఇష్టం. అమ్మ తనను తిట్టినా ఊరుకుంటుందిగానీ స్వాతినేదయినా అంటే అస్సలు ఒప్పుకోదు. మరిది సురేష్ కూడా వదినంటే చాలా గౌరవంగా ఉంటాడు. ముగ్గురూ దగ్గర దగ్గర ఒకే వయసు వాళ్ళవడంతో కబుర్లు చెప్పుకోవడం, ఏవైనా గేమ్స్ ఆడుకోవడం చేస్తుంటారు. స్వాతి పెద్దగా మాట్లాడదు. అన్నాచెల్లెళ్ళ కబుర్లు ఎంజాయ్ చేస్తుంటుంది.

మహలక్ష్మమ్మకు ఇది సుతరామూ ఇష్టముండదు. కోడలు రిజర్వుడుగా

తెలివైన కోడలు

– భారతి రామచంద్రుని



ఉంటుందనీ పొగరు అనీ ఆమె భావన. స్వాతిలో ఏదో ఒక లోపం వెతుకుతూనే ఉంటుంది. సరిగ్గా సమాధానం చెప్పదని దెప్పుతుంటుంది. ఆవిడ అలా మాట్లాడుతుంటే స్వాతి భరించలేక పోతోంది. బాధతో కోపంతో ఉక్కిరిబిక్కి రవుతోంది. ఆ మాట్లాడే ఒక మాట కూడా మానేసి సైలెంటైపోతోంది. స్వాతికి అత్తగారు పెట్టే నస విసుగొస్తోంది. ఉద్యోగం వెతుక్కుని బయటికెళితే ఈ గొడవ వదులుతుందని జాబ్స్‌కు అప్లై చేయడం మొదలుపెట్టింది.

ఆ రోజు సుధీర్ తోడురాగా ఇంటర్వ్యూకెళ్ళింది స్వాతి. తీరా లోపలికెళ్ళే సమయానికి తల తిరిగి వాంతి చేసుకుంది. సుధీర్ కంగారు పడిపోయి అటునుండటే హాస్పిటల్‌కు తీసుకెళ్ళాడు. లేడీ డాక్టర్ చెక్ చేసి స్వాతి ప్రెగ్నెంట్ అని చెప్పింది.

ఇక ఆరోజు ఇంటిల్లిపాదికీ ఆనందం అవధులు దాటింది. శృతి స్వీట్లు పంచి సెలబ్రేట్ చేసింది.

మహలక్ష్మమ్మ కోడలిని కాలు కదపనీయకుండా టైముకు భోజనం, ఇష్టమైనవన్నీ అడిగి చేసి, తినిపించడం చేస్తోంది. అంతటితో ఊరుకుంటుందా... అన్నీ తను చెప్పినట్లే చెయ్యాలి. తను పెట్టినట్లే తినాలి. కూర్చోకూడదు నిలబడకూడదు. సహించకపోయినా తిని తీరాలి. తినకపోతే బిడ్డ ఎలా ఎదుగుతుంది అంటూ సతాయింపు. ఆమె అతి జాగ్రత్త భరించడం కూడా కష్టమే అయింది స్వాతికి. సురేష్, శృతీ వదినను అపురూపంగా చూస్తున్నారు. స్వాతికి ఇదో సరికొత్త అనుభవంలా ఉంది. ఉద్యోగం సద్యోగం అటకెక్కాయి. మొదటి నుండీ స్వాతికి ఉద్యోగం చెయ్యాలని పెద్ద ఇంట్రెస్టు లేదు.

మూడోనెలలో స్వాతి పుట్టింటికి పోయి వచ్చింది. ఏడో నెలలో సీమంతం చేసి పురిటికి తీసుకెళ్ళారు.

★ ★ ★

స్వాతికి బాబు పుట్టాడు. అందరూ స్వాతి పుట్టింటికి వెళ్ళి బారసాల చేసుకుని వచ్చారు. బాబు నెత్తుకుని సారెతో వచ్చింది స్వాతి మూడవనెల వెళ్ళేలోపు.

సురేష్‌కు ఈ లోపల కొన్ని సంబంధాలు చూశారు. చివరకు వాళ్ళుండే సిటీలోనే అమ్మాయి కుదిరింది. అంగరంగ వైభవంగా పెళ్ళి జరిగింది. అమ్మాయి తరపు వారికి ఫ్యాషన్లు బాగా ఎక్కువ. కింద చూపులేదు. హైఫైగా ఉన్నారు. వాళ్ళే నాగరికత తెలిసినవారన్నట్లు పెద్ద బిల్డప్.

ఊర్లోనే కాబట్టి పెళ్ళైన వారం లోపల ఒకరోజు వియ్యాలవారిని భోజనానికి ఆహ్వానించారు. అన్నీ తెప్పించిన బాపతే. వడ్డనకు స్పూన్లు. గిన్నె స్పూనూ పట్టుకుని 'వెయ్యనా వెయ్యనా' అంటారు. స్పూనుతో ఎంత కూర పడుతుంది? అందరూ మొహమాటానికిపోయి అర్ధాకలితో తిరిగొచ్చారు.

ఇంటికొచ్చి శృతి, సుధీర్, వాళ్ళ నాన్నగారూ ఒకటే నవ్వుకోవడం. ఆకలి తీరక ఉప్మా

చేయించుకుని తిన్నారు. మహాలక్ష్మమ్మకు ముఖం చిన్నబోయింది. 'సురేష్ అక్కడే ఉండిపోయాడు. అది కొంత నయం, వీళ్ళ మాటలు వినలేదు' అనుకుంది.

కొత్తకోడలు వచ్చింది. వాళ్ళ వదినా అన్నా అక్కలూ తీసుకొచ్చి దింపారు. అందరూ మహాలక్ష్మమ్మగారిని ఆకాశానికెత్తి పట్టారు. ఆమె వంటను తెగ మెచ్చుకుంటూ సుష్టుగా భోజనాలు చేశారు. ఆమెకూ వాళ్ళ ప్యాషన్లూ గొప్పలు చెప్పుకోవడం బాగా నచ్చినట్లుంది. 'వాళ్ళతో ఎంత ఇష్టంగా మాట్లాడుతారో, అదే మా వాళ్ళతో అంటే ముట్టనట్లు ఉంటారు' అనుకుంది స్వాతి.

మరునాడు స్వాతి ఉదయాన్నే లేచి తన రొటీన్ వర్కులోకి దిగింది. సైలెంట్‌గా పని చేసుకుంటూ పోతోంది. కొత్తకోడలు రూప మెల్లగా ఎనిమిదింటికి లేచి తన రూములోనే ఫ్రెష్ అయి మేకప్‌తో బయటికొచ్చింది. అత్తగారు కాఫీ ఇచ్చింది ఆప్యాయంగా.

"అబ్బ, ఎంత బాగుందండీ అత్తయ్యగారూ కాఫీ! ఎలా చేశారు?" అనగానే ఇంకో కప్పు అందించింది మహాలక్ష్మమ్మ ఉబ్బితబ్బిబ్బవుతూ. ఆ కప్పూ ఖాళీ చేసి అత్తగారికి వాళ్ళ ఇంటి ముచ్చట్లు చెబుతూ కూర్చుంది.

ఊర్లోనే పుట్టిల్లు కావడంతో అటూ ఇటూ తిరుగుతుంటుంది చిన్న కోడలు. వచ్చినప్పుడల్లా అక్క కూతుళ్ళనో అన్న పిల్లలనో తీసుకొస్తుంది.

"అత్తయ్యగారూ, మొన్న మీరు బిర్యానీ చేశారు కదా. మా అక్క పిల్లలు ఎంత బావుందని చెప్పుకున్నారో. హోటల్ స్టైల్లో చేశారట రూప అత్తగారు అని మా ఇంట్లో అందరూ అనుకోవడమే" అంటూ అత్తగారిని మునగచెట్టు ఎక్కించేస్తుంది రూప.

"అయ్యో, దానికేం భాగ్యం... సండే రమ్మను, మళ్ళీ చేసి పెడతాను."

"మీరు చాలా ఫాస్ట్‌గా కూడా చేస్తారండీ ఏ పనైనా. మా అందరికంటే మీరే యాక్టివ్‌గా ఉంటారు" రూప మాటలకు విస్తుపోతోంది స్వాతి. 'అత్తగారితో ఇలా కూడా మాట్లాడవచ్చా' అనుకుంది.

అలా అత్తగారిని సమయస్ఫూర్తితో బుట్టలో వేసేసింది. చిన్నకోడలు ఏ పనీ చెయ్యకపోయినా కూర్చుని చేయించుకు తిన్నా అవేవీ మహాలక్ష్మమ్మకు ఎక్కడం లేదు. రూప బంధువర్గం వచ్చిపోతుంటే వారికి మర్యాదలు చేస్తున్నా- వెనకటిలా- కోడలు తరఫువారికి చేస్తున్నాననే చిరాకు ఉండటం లేదు. అదే స్వాతి అమ్మా నాన్నా వస్తే వియ్యపురాలి టెక్కు చూపించేది. స్వాతిలో ఏదో ఒక లోపం వెతికి వాళ్ళ అమ్మకే నేరాలు చెప్పేది.

రూప తనను విమర్శించే ఛాన్సే ఇవ్వడంలేదు. ముందుగానే ఊహించి తగినట్లు మాట్లాడి టాపిక్ డైవర్ట్ చేస్తుంది. 'అత్తయ్యగారూ' అంటూ ఆప్యాయత ఉట్టిపడేలా పిలుస్తుంటుంది అస్తమానం.

రూప ఉద్యోగం చేస్తోంది. ఇంటినుండే పని చేస్తోంది. బయట ఉన్న కాసేపూ అత్తగారితో గలగలా మాట్లాడుతూనే ఉంటుంది. మిగిలిన టైమంతా సిస్టమ్ ముందు పెట్టుకుని కూర్చుంటుంది.

స్వాతి కొడుకును బాగా ముద్దు చేస్తుంది రూప. వాడిని తన దగ్గరే కూర్చోబెట్టుకుని ఆడిస్తుంటుంది. స్వాతికి చాలా రిలీఫ్‌గా ఉంటోంది పని చేసుకోవడానికి.

శృతికి చదువులో హెల్ప్ చేస్తుంది. ప్యాషన్ డిజైన్స్ గురించి చర్చలు పెడుతుంది. సుధీర్‌తో కూడా చక్కగా కలుపుగోలుగా ఉంటుంది. 'బావగారూ' అంటూ కబుర్లు చెబుతుంది. మామగారిపట్ల గౌరవం చూపిస్తుంది. కామ్‌గా ఉంటుందనీ తనపని తాను చేసుకుపోతూ ఏ విషయాలూ పెద్ద పట్టించుకోదనీ స్వాతి అంటే రూపకు



ప్రత్యేకమైన అభిమానం. సొంత అక్కలా ప్రేమ చూపిస్తుంది. అత్తగారు వినకుండా స్వాతిని మెచ్చుకుంటుంటుంది.

సంక్రాంతి పండుగ వచ్చింది. కొత్తకోడలు వచ్చిందనీ మనవడు పుట్టాడనీ- పండుగ గ్రాండ్‌గా తమ ఇంట్లోనే చేసుకోవాలని- కోడళ్ళను పుట్టిళ్ళకు పంపించనని కబురు చేసింది వియ్యాలవారికి మహాలక్ష్మమ్మ.

"మంచి పని చేశారు అత్తయ్యగారూ. ఇప్పటివరకూ అక్కడేగా ఉన్నాం. ఈ పండుగకు ఇక్కడే ఎంజాయ్ చేద్దాం. షాపింగ్‌కు ఎప్పుడు వెళ్దామండీ?" అంది ఉత్సాహంగా రూప.

'ఈ అమ్మాయికి ఎన్ని కళలు బాబూ! ఎవరికి తగినట్లు వారితో మాట్లాడుతుంది. అత్తగారికి సరైన కోడలు దొరికింది' అనుకున్నారు శ్రీధరరావుగారు.

"మీరు వెళ్ళి డ్రెస్సులు తెచ్చుకోండి. శృతిని కూడా తీసుకెళ్ళండి" అంటూ భర్తనడిగి పదివేలు తెచ్చి ఇవ్వబోయింది మహాలక్ష్మమ్మ.

"మీరూ రావలసిందే. మీకూ చీర కొనాలిగా. పైగా మీ సెలెక్షన్ చాలా బావుంటుంది. మీ చీరల కలర్స్ చాలా డిఫరెంట్‌గా ఉంటాయి" అంటూ పొగిడేసరికి మహాలక్ష్మమ్మ కాదనలేక తనూ కదిలింది. ఆడవాళ్ళంతా షాపింగ్‌కు బయలుదేరారు.

పండుగ మూడురోజులు ఎంతో సందడిగా జరుపుకున్నారు. రూప వచ్చిన దగ్గరనుండి స్వాతిని ఏమీ అనలేకపోతోంది మహాలక్ష్మమ్మ. అసలు తప్పులు వెతికే అవకాశం రావడంలేదు. ఇంట్లో వాతావరణమే మారిపోయింది. తను ఇంతకు ముందులా సాధిస్తే చిన్న కోడలు ఏమనుకుంటుందో అని క్రమేణా తన ధోరణి మార్చుకుంటోంది.

"అత్తయ్యగారూ, వరల్డ్ ఫేమస్ ఇంగ్లిష్ మూవీ వచ్చిందండీ... వెళదామా?" అడిగింది రూప.

"నాకంతగా అర్థంకాదులేమ్మా. హిందీ అన్నా అయితే కాస్త చూస్తాను" అంది మహాలక్ష్మమ్మ.

"నేను పక్కనే ఉంటానుగా. చెప్తుంటాలెండి."

"లేదులే, మీరు వెళ్ళి రండి."

"బావగారూ, అందరం వెళదామండీ... అక్కా మీరూ శృతీ కూడా."

"ఓకే" అన్నాడు సుధీర్.

"వీడు చూడనివ్వడు రూపా. నేను రానులే" అంది స్వాతి.

"అత్తయ్యగారు ఎలాగూ రానంటున్నారు కదా. బాబు తన దగ్గర ఉంటాడ్లే. ఏమంటారు అత్తయ్యగారూ" అనేసింది అత్తగారిని చూస్తూ చొరవగా.

స్వాతికి భయం వేసింది ఆమె ఏమంటుందో అని.

రూప అడిగిన తీరుకు ఏమీ అనలేకపోయింది మహాలక్ష్మమ్మ.

సుధీర్ ఆశ్చర్యంగా చూశాడు తల్లివైపు.

"అత్తయ్యగారూ, మీకూ మామయ్యగారికీ టిఫినే కదా, ఆర్డర్ పెడతానండీ. మీరు హాయిగా టీవీ చూస్తూ రిలాక్స్ అవండి. మేము మాల్‌లో తినేసి వస్తాం" నార్మల్‌గా చెప్పేసి అందరినీ బయలుదేరదీసింది రూప.

సురేష్‌కు చిత్ర విచిత్రంగా ఉంది. ఇన్నాళ్ళూ వదినను చూశాడు. ఇప్పుడు భార్యను చూస్తున్నాడు. 'ఎంత వ్యత్యాసం' అనుకోకుండా ఉండలేకపోయాడు. కాస్త గర్వంగా కూడా అనిపించింది భార్య నేర్పరితనానికి.

"చూసి నేర్చుకో సీతమ్మ తల్లీ" అంటూ స్వాతితో పరాచకమాడింది శృతి.

"హ్యాట్సాఫ్ రూపా... నిజంగా నీ సమయస్ఫూర్తి తెలివీ చక్కని మాటతీరూ అందరికీ రావు. ఎప్పటికెలా మాట్లాడాలో ఎవరితో ఎలా మెలగాలో నీకు బాగా తెలుసు. అత్తగారిని ఎంతలా మార్చేశావు..." తోడికోడలి వైపు అభినందనగా చూస్తూ- మనసులో అనుకుంది స్వాతి. ★

కోరుకున్న వస్తువు ఒక్క క్లిక్‌తో ఇంటికి వస్తున్న రోజులివి. మరి, గ్రామీణుల సంగతి... వాళ్లూ అలాగే తెప్పించుకోగలుగుతున్నారా? తమ సొంత ఉత్పత్తుల్నీ పట్టణాల్లో, నగరాల్లో నేరుగా విక్రయించగలుగుతున్నారా... అనే ప్రశ్నల నుంచి ప్రారంభమైందే 'హేసా'. అటు వ్యాపారులకూ ఇటు గ్రామీణులకూ మధ్యవర్తిత్వం వహించే ఈ సంస్థ గ్రామీణుల సమస్యలకు చక్కని పరిష్కారాన్ని చూపిస్తోంది.



హేసా... గ్రామీణుల అమెజాన్!



ఆమె పేరు శ్రీదేవి... వరంగల్‌లోని గంగదేవిపల్లి గ్రామ స్వయం సహాయక సంఘంలో సభ్యురాలు. ఒకప్పటితో పోలిస్తే ఇప్పుడు నెలకు పది నుంచి ఇరవై వేల రూపాయల వరకూ సంపాదించుకోగలుగుతోంది. ఊళ్లోవాళ్లు కోరుకునే నిత్యావసరాలనూ ఇతర వస్తువులనూ ఆర్డర్లపైన తెప్పిస్తూ పరోక్షంగా తానూ లబ్ధిపొందుతోంది. ఇంకా విద్యార్థులూ, సాంకేతికతపైన కాస్త పట్టున్న యువతా, స్వయంసహాయక సంఘాల మహిళలూ, చిరు వ్యాపారులూ కలిపి దాదాపు నలభైవేలమంది గ్రామీణులు 'హేసా' ద్వారా స్థిరమైన జీవితానికి బాటలు వేసుకుంటున్నారు. 'హేసా'... హైదరాబాద్ కేంద్రంగా పనిచేసే సంస్థ అయినా దీని ప్రధాన లక్ష్యం పల్లెటూళ్లే. ఈ రోజుల్లో చాలా వ్యాపార లావాదేవీలు స్మార్ట్‌ఫోన్‌తోనే అయిపోతున్నాయి. వాట్సాప్ ద్వారానే ఎంతోమంది చిన్నచిన్న వ్యాపారాలు చేస్తున్నారు. ఆర్థిక లావాదేవీలూ అంతే. అయితే... గ్రామీణులకు స్మార్ట్‌ఫోన్ అందుబాటులో ఉన్నా ఎలా వాడాలో తెలియక కొన్నిసార్లు మోసపోతుంటారు. ఇక, పలు ఈ-కామర్స్ సైట్లు తమ వ్యాపారాలను నగరాలు లేదా పట్టణాలకు మాత్రమే పరిమితం చేస్తుంటాయి తప్ప చిన్నచిన్న పల్లెటూళ్ల వరకూ వెళ్లవు. ఇవన్నీ చూశాక ఇద్దరికీ మేలు చేయాలనే ఉద్దేశంతోనే హేసాను అందుబాటులోకి తెచ్చారు వంశీ ఉదయగిరి. వంశీ స్వస్థలం విజయనగరం జిల్లాలోని వేపాడ గ్రామం. శ్రీ వేంకటేశ్వర యూనివర్సిటీ నుంచి మెకానికల్ ఇంజినీరింగ్ పూర్తిచేశాక ఉద్యోగం కాకుండా కాస్త భిన్నంగా ఏదైనా చేయాలనుకున్నారు. అందుకే దాదాపు పది, పన్నెండేళ్లు గ్రామాల్లో తిరిగారు. ఎంతో మందితో మాట్లాడాడు. ఆ క్రమంలోనే వాళ్లకు ఉపయోగపడేలా ఏదయినా చేయాలనే ఉద్దేశంతో 2020లో హేసాను అందుబాటులోకి తెచ్చారు. 'పల్లెటూళ్లను ఆధారంగా చేసుకుని ఓ స్టార్టప్‌ను ప్రారంభించడం అంటే మాటలు కాదు. పల్లెప్రజల్లో ఎన్నో భయాలూ మరెన్నో అపోహలూ ఉంటాయి. అవగాహనా తక్కువే. ఇవన్నీ అర్థంచేసుకుని తరచూ వాళ్లను కలుస్తూ సమస్యలు తెలుసుకుంటూ తోచిన సాయం చేస్తూనే నెమ్మదిగా హేసాను అందుబాటులోకి తెచ్చాం. ప్రారంభంలో డెబ్భైఅయిదుమంది మాత్రమే ముందుకొచ్చారు. ప్రస్తుతం ఇందులో నలభైవేలమంది సభ్యులుగా ఉంటే... పరోక్షంగా లక్షమందికి పైగా గ్రామీణులు లబ్ధి పొందుతున్నారు. కిందటి సంవత్సరం హేసా మొత్తంగా పదిహేను వందల కోట్ల రూపాయల ఆర్థిక లావాదేవీలను జరపడమే అందుకు ఉదాహరణ. ఒక్క మాటలో చెప్పాలంటే హేసా రూరల్ అమెజాన్ లాంటిదే...' అంటారు దీని వ్యవస్థాపకులు వంశీ ఉదయగిరి.

శిక్షణ ఇచ్చి మరీ...

సాధారణంగా అమెజాన్ వెబ్‌సైట్‌లోకి వెళ్లి ఏ చిన్న వస్తువును ఆర్డరు పెట్టినా చెప్పిన అడ్రస్‌కు వస్తుంది కదా... అచ్చంగా అలాంటి విధానాన్నే తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఒడిశా, తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్‌లలోని మారుమూల గ్రామాల్లో అమలు చేసింది హేసా. స్వయంసహాయక బృందాల్లోని మహిళలు, విద్యార్థులు, యువత, స్థానిక చిరువ్యాపారులు, రైతులు, ఇంకాస్త ఎక్కువ ఆదాయం కోసం ఎదురుచూస్తున్న వారు, టెక్నాలజీపైన కాస్త అవగాహన ఉన్న వారు, వ్యాపారం చేయాలనే జిజ్ఞాసాపరులు... ఇలా ఎవరైనా హేసాలో సభ్యులు కావొచ్చు. వీళ్లకు అవసరమైన శిక్షణ అందించి, 'హేసాథీ'లుగా తీర్చిదిద్దుతారు ఈ సంస్థ సిబ్బంది. అలా శిక్షణ తీసుకున్న హేసాథీలు... ఓ వైపు తమ రోజువారీ పనులూ వ్యాపారాలూ చేసుకుంటూనే మరో వైపు గ్రామీణులు కోరిన వస్తువుల్ని పట్టణాలు లేదా నగరాల నుంచి తెప్పించే వారధులవుతారు. అందులో బాస్మతీ బియ్యం, సాస్‌లు, బ్రాండెడ్ గోధుమపిండి నుంచి ఎరువులూ, విత్తనాలూ, పనిముట్లూ, ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్లూ.. ఇలా ఎవైనా ఉండొచ్చు. అవి కాకుండా బ్యాంకు వ్యవహారాలను చేసి పెట్టడం, గ్రామీణులు తయారు చేసిన వస్తువుల్ని అమ్మిపెట్టడం, రైతుల పంటను మార్కెట్‌లోకి తీసుకెళ్లడం... ఇలా ఊళ్లోవాళ్లు ఏది కావాలన్నా చేసి పెట్టేందుకు కూడా హేసాథీలు సిద్ధంగా ఉంటారు. వీళ్ల పనితీరును పర్యవేక్షించేందుకూ, సాయం చేసేందుకూ ఫీల్డ్‌ఆఫీసర్లు ఉంటారు. ఆ వ్యవహారాలన్నీ చక్కబెట్టేందుకు హేసా యాప్‌లో ప్రత్యేకంగా 'వాలెట్' పేరుతో ఓ సదుపాయం ఉంటుంది. ఆ వాలెట్ ద్వారానే హేసాథీలు ఆర్డర్లు పెడతారన్నమాట. అవన్నీ హేసా సిబ్బంది ద్వారా వాళ్లకు చేరతాయి. ఈ పనులన్నీ చేసి పెట్టినందుకు ఈ హేసాథీలకు నెలకు పది నుంచి పదిహేనువేల రూపాయల వరకూ ఆదాయం వస్తుంది. ఇందుకోసం ఈ సంస్థ పీఅండ్‌జీ, హిమాలయ, వాల్‌మార్ట్, రిలయన్స్, ఫ్లిప్‌కార్ట్, ఐటీసీ, మెట్రో, గోద్రెజ్ అగ్రోవెట్... తదితర ఎన్నో సంస్థలతో అనుసంధానం కావడం గమనార్హం. ★





పుట్టినరోజు ఎవరికైనా పండుగే. ప్రియమైన వారితో సరదాగా గడపడం, కేకు కోయడం, ఫొటోలు దిగి మురిసిపోవడం, విందు ఆరగించడం... చెప్పుకుంటూ పోతే ఆ రోజున చేసే ఎంజాయ్‌మెంట్ మామూలుగా ఉండదు. మరి, ఆ వేడుకకు జాలీట్రిప్‌తోపాటు సర్‌ప్రైజ్‌లు కూడా తోడైతే... అదో మంచి జ్ఞాపకంగా మారిపోదూ. అందుకే ఈసారి పార్టీ ఆన్ వీల్స్ ట్రెండ్‌ను ఫాలో అయిపోతే సరి. ఓ వైపు విహరిస్తూ, మరోవైపు పార్టీ చేసుకోవడం అన్నమాట. అదేంటో ఇంకా వివరంగా చూద్దాం.

ఊరు చూస్తూ... పార్టీ చేసుకుంటూ!







పావని పుట్టినరోజు సందర్భంగా స్నేహితులంతా వన్‌డే ట్రిప్ వేయాలనుకున్నారు. ఆ రోజు పొద్దున్నే పావని ఇంటిముందుకు ఓ బస్సు వచ్చి ఆగింది. అందులోకి ఎక్కిన ఆమెకు చుట్టూ రంగురంగుల బెలూన్లు, కేకు, మంచినీళ్లు, తినడానికి చిరుతిళ్లు... ఇలా బర్త్‌డే పార్టీకి కావాల్సినవన్నీ కనిపించాయి. ఫ్రెండ్స్ అంతా ఒక్కసారిగా హ్యాపీబర్త్‌డే అని అరుస్తూనే మంచి మ్యూజిక్‌నీ పెట్టడంతో ఆశ్చర్యపోయింది. విషయం ఏంటంటే... ఇప్పుడు- పుట్టినరోజులాంటి చిన్నచిన్న పార్టీలకోసం 'పార్టీ ఆన్ వీల్స్/క్లబ్ ఆన్ వీల్స్' పేరుతో ప్రత్యేక ఏర్పాట్లు అందుబాటులోకి వచ్చాయి. అందులో ఒకటే ఈ బర్త్ డే పార్టీ బస్. ఇదొక్కటనే కాదు, నీళ్లమధ్యనో, ఆకాశంలోనో జాలీగా విహరిస్తూ పార్టీ చేసుకోవాలనుకునేవారి కోసం అలాంటి సదుపాయాలూ ఉన్నాయి. ఒకప్పటితో పోలిస్తే ఇప్పుడు ప్రతి చిన్న సందర్భాన్నీ వేడుకగా చేసుకోవాలనుకుంటున్నవారే ఎక్కువ. దానికితోడు, పార్టీ చిన్నదైనా, పెద్దదైనా ఎప్పుడూ రొటీన్‌గా కాకుండా కాస్త వెరైటీగా ఎంజాయ్ చేయాలని కోరుకోవడమూ సహజమేగా. వీటన్నింటినీ దృష్టిలో పెట్టుకుని ఈవెంట్ మేనేజ్‌మెంట్ సంస్థలు ఇలాంటి ప్రత్యేకమైన ఏర్పాట్లు చేసేందుకు ముందుకొస్తున్నాయి. అందులో ఒకటే- పావని ఎక్కిన పార్టీ బస్. కొన్ని ట్రావెల్ సంస్థలు క్యారవాన్లను వేడుకలకూ అనుగుణంగా మార్చి, అదనంగా రకరకాల సర్‌ప్రైజ్‌లు కూడా జతచేసి పార్టీలను ఇలా కూడా ఎంజాయ్ చేయొచ్చని చెప్పకనే చెబుతున్నాయి. క్యారవాన్లు సాధారణ బస్సుల్లా కాకుండా అంతా కలిసి ఎదురెదురుగా కూర్చుని సరదాగా గడిపేలా ఉంటాయిగా. వాటిల్లోనే ఇప్పుడు వేడుకను బట్టి అదనపు ఏర్పాట్లు చేస్తారన్నమాట. మనం కోరుకున్నట్లుగా బెలూన్లు, డీజే, కేకు, కావాలనుకుంటే భోజనం, వైఫై, ఏసీ... వంటివన్నీ ఉంటాయి. దాదాపు పది నుంచి పాతికమందివరకూ ఉపయోగించుకునేలా ఉంటాయీ పార్టీ బస్సులు.

ఆకాశంలో విహరించేలా...

కొందరు సంపన్నులు చిన్నచిన్న గెట్ టుగెదర్‌లను ప్రైవేట్‌జెట్ లేదా బోట్‌లలో నిర్వహించడం సినిమాల్లోనే ఎక్కువగా చూస్తుంటాం కదా. అలాంటి వేడుకల్ని మన ఇంట్లోవాళ్లకోసమూ చేయొచ్చు. అందులో ఒకటి ప్రైవేట్ బోట్ పార్టీ. హైదరాబాద్‌లోని దుర్గంచెరువు, హుస్సేన్‌సాగర్‌లలో ఉన్న ఈ బోట్‌పార్టీలు మరచిపోలేని అనుభూతిని సొంతం చేస్తాయి. వేడుకను బట్టి... పార్టీ నిర్వాహకుల్ని సంప్రదిస్తే హాజరయ్యే వ్యక్తులకు సరిపోయేలా బోట్‌ను సిద్ధం చేస్తారు. కస్టమర్ల అభిరుచికి తగినట్లుగా- ఇక్కడా బస్సుల్లో మాదిరి అన్నిరకాల సదుపాయాలూ ఉంటాయి. ఈ పార్టీ ట్రిప్ గంట నుంచి రెండుమూడు గంటలవరకూ ఉంటుంది. లేదూ ఇంకా కొత్తదనం కోరుకునేవారు ప్రైవేట్‌జెట్‌లలో పార్టీలను చేసుకోవచ్చు. అయితే, ఇవి అరగంట నుంచి గంటన్నర వరకూ మాత్రమే ఉంటాయి. ఓ వైపు ఆకాశంలో విహరిస్తూ, మరోవైపు కేక్ కట్‌చేస్తూ, సన్నిహితుల అభినందనలు అందుకుంటూ మధ్యమధ్య ఫొటోలు దిగుతూ ఉంటే... అదో మర్చిపోలేని జ్ఞాపకం అవదా!

వీటన్నింటిలోనూ- పార్టీకి వచ్చే వారి సంఖ్య, సదుపాయాలు, ఎంచుకునే గంటలు తదితర అంశాల ఆధారంగా ధరను నిర్ణయిస్తారు. హైదరాబాద్‌తోపాటు చెన్నై, బెంగళూరు, ముంబయి, దిల్లీ... వంటి అన్ని రాష్ట్రాల్లో ఈ పార్టీ ఆన్ వీల్స్ ఉండటం గమనార్హం. అదండీ సంగతి... పార్టీ అనగానే ఏ రెస్టరంట్‌కో, ప్రైవేట్ థియేటర్‌కో వెళ్లడం ఇప్పటికే మామూలైపోయింది. సో, అనుకున్న బడ్జెట్‌లో వీలైనంత కొత్తగా, ఎప్పటికీ గుర్తుండిపోయేలా స్నేహితులకు పార్టీ ఇవ్వాలనుకుంటే ఇలాంటివాటిని ట్రై చేయొచ్చు, ఓ మంచి జ్ఞాపకంగానూ ఫొటోల్లో బంధించుకోవచ్చు... ఏమంటారు. ★







'ఆ కూలీల కోసం ఉద్యోగానికి రాజీనామా చేస్తావా... నీకేమైనా పిచ్చా?' అని తోకతొక్కిన పాములా లేచాడు వాళ్ల నాన్న. 'మంచి కెరీర్‌ని పాడుచేసుకోవద్దు' అంటూ సలహా ఇచ్చారు మిత్రులు. అయినా సరే చంద్రశేఖర్ తాను అనుకున్నదే చేశాడు. ఉద్యోగం మానేసి రూ.20 వేలతో ఆ సంస్థని ప్రారంభించాడు. మొదట్లో అతనేం చెబుతున్నాడో... అడ్డాకూలీలకి అర్థంకాలేదు. కానీ మెల్లగా వాళ్లు నమ్మడం మొదలుపెట్టారు. ఆ నమ్మకమే... చంద్రశేఖర్ మండల్‌ని కోట్ల రూపాయల సంస్థకి అధిపతిని చేసింది. 'డిజిటల్ లేబర్ చౌక్'తో ఓ కొత్త ఒరవడి దిద్దించింది!

కూలీలకి సాయం చేసి... కోట్లు సంపాదించాడు!

అదో వర్షాకాలం. ఆఫీస్ బ్రేక్ టైమ్‌లో టీ తాగుతూ బాల్కనీ వద్దకు వచ్చి నిల్చున్నాడు అతను. అప్పటిదాకా సన్నగా పడుతున్న వర్షం కాస్తా జోరువానగా మారడంతో... రోడ్డుపైనున్న వాళ్లందరూ తమ కార్యాలయాల్లోకి పరుగెత్తసాగారు. అలా పరుగెత్తలేనివాళ్లు... అడ్డాకూలీలే! పలుగూపారా చేతపట్టుకుని పసిపిల్లలతోపాటు ఓ చెట్టుకింద ఉండిపోయారువాళ్లు. వర్షం నుంచి చెట్టునీడ వాళ్లని పూర్తిగా రక్షించలేకపోవడంతో... పూర్తిగా తడుస్తూ అలా నిల్చుండిపోయారు! ఆ దృశ్యం తన తల్లిదండ్రుల్నీ బాబాయిల్నీ గుర్తుకు తెచ్చిందంటాడు చంద్రశేఖర్ మండల్. ఆ దైన్యమే తన సంస్థ స్థాపనకి పునాదిగా మారిందనీ చెబుతాడు!

చంద్రశేఖర్ మండల్‌ది బిహార్‌లో కరవుకు పేరుమోసిన దర్భంగ జిల్లా... అందులోని అమీ అనే కుగ్రామం. అతని తల్లిదండ్రులు కూడా ఒకప్పుడు పొట్టచేతపట్టుకుని పట్టణాలకి కూలీకని వెళ్లినవాళ్లే. వాళ్లనాన్న పెట్టిన చిల్లరకొట్టు కొంతవరకూ ఆదుకుంది... అయినా అతని బాబాయిలూ భవన నిర్మాణ కార్మికులుగా వెళుతుండేవాళ్లు. వారి దైన్యాన్ని చూస్తూ పెరిగాడు చంద్రశేఖర్. దిల్లీలో ఎంకామ్ చదివి... ముంబయిలోని ఓ ప్రైవేటు బ్యాంకులో పనిచేస్తుండేవాడు. అప్పుడో రోజు చూసిన దృశ్యమే అతని సోషల్ స్టార్టప్‌కి నాందిగా మారింది. 'చదువుకున్నవాళ్లకి లింక్డ్ ఇన్, నౌక్రి డాట్ కామ్ వంటివి ఉన్నట్టు... రోజు కూలీలకి ఓ యాప్ ఎందుకు ఉండకూడదు?' అన్న ఆలోచన వచ్చిందతనికి. ఆ తర్వాత నెలకే దేశవ్యాప్తంగా లాక్‌డౌన్ పడటంతో... చంద్రశేఖర్ తన ఊరికి వచ్చేశాడు. లాక్‌డౌన్‌తో- పిల్లాపాపలతో వేల కిలోమీటర్లు నడిచి సొంతూరికి వస్తున్న కూలీల దీనావస్థ చూశాక... ఇక ఆలస్యం చేయలేదు. ఉద్యోగానికి రాజీనామా చేసి, స్టార్టప్ పెట్టాలన్న తన ఆలోచనని అందరికీ చెప్పాడు!



ఒక్కో అడుగు...

'మేం పస్తులుండి మరీ నిన్ను దిల్లీలో చదివించింది... ఉద్యోగాన్ని వదిలి పనికిరాని వ్యాపారాలు చేస్తావని కాదు' అని వాళ్ల నాన్న కస్సుమన్నాడు. స్నేహితులూ వారించారు. అయినా సరే చంద్రశేఖర్ మండల్ ఉద్యోగానికి రాజీనామా చేసి... తనకి వచ్చిన రూ.20 వేలతో 'డిజిటల్ లేబర్ చౌక్' సంస్థని ప్రారంభించాడు.

కానీ, అతని మిత్రులు భయపెట్టినట్టే అయ్యింది. రోజుకూలీలెవ్వరికీ అతను చెబుతున్న యాప్ ఏమిటో... అది తమకెలా పని కల్పిస్తుందో అర్థంకాలేదు. దాంతో తన పంథా కాస్త మార్చాడు. దర్భంగ జిల్లా కేంద్రంలో కూలీలు పనుల కోసం నిల్చునే కూడళ్ల(అడ్డా లేదా చౌక్) దగ్గరకెళ్లి వాళ్ల పేర్లని తన సంస్థలో రిజిస్టర్ చేసుకున్నాడు. అలా రిజిస్టర్ చేసినవాళ్లు- రోడ్డుపైన పడిగాపులు పడాల్సిన అవసరం లేకుండా- భవన నిర్మాణ కాంట్రాక్టర్లతో తానే నేరుగా మాట్లాడి పనులు కల్పించసాగాడు. అలా మూడునెలల్లోనే ఐదువేల మంది కూలీలు అతని సంస్థలో నమోదయ్యారు. మొదట్లో అలా ఆఫ్‌లైన్‌లో నడిచిన ఈ పద్ధతిని...



'వాట్సాప్'కి మార్చాడు. మెల్లగా 'యాప్'ని పరిచయం చేశాడు. ఆ మోడల్ సక్సెస్ అయ్యాక... దీన్ని దేశవ్యాప్తంగా విస్తరించాలనుకున్నాడు చంద్రశేఖర్. కానీ... అతని విస్తరణ ప్రయత్నాలకి బ్యాంకులేవీ రుణాలివ్వలేదు. వెంచర్ క్యాపిటలిస్టులూ ఆదుకోలేదు. ఆ నేపథ్యంలోనే- పుణెలో జరిగిన స్టార్టప్ ఇన్నొవేషన్ పోటీలోనూ, కేరళ 'నేషనల్ ఇన్నొవేషన్ ఛాలెంజ్'లోనూ అతని ఆలోచనకి బ్రహ్మరథం పట్టారు. ఆ రెండింటిలోనూ 'ఉత్తమ సోషల్ స్టార్టప్'గా రూ.40 లక్షలు బహుమతిగా వచ్చాయి. దాంతో దిల్లీ, ముంబయి, హైదరాబాద్ సహా 27 నగరాల్లో తన సేవల్ని మొదలుపెట్టాడు. ఆయా నగరాల్లోని కూలీలు ఎవరైనా సరే వీళ్ల యాప్‌ని డౌన్‌లోడ్ చేసుకుని... తమ వివరాలని నమోదు చేస్తే చాలు... అక్కడి స్థిరాస్తి సంస్థలు వాళ్లని నేరుగా కాంటాక్ట్ అవుతాయి. ఇప్పటిదాకా వీళ్ల యాప్‌లో రెండున్నర లక్షలమంది శ్రామికులు రిజిస్టర్ అయ్యారు... ఐదువేల స్థిరాస్తి సంస్థలు పనులు కల్పిస్తున్నాయి.

తన సంస్థ ద్వారా ప్రతి కూలీకీ నెలకి కనీసం 21 రోజులపాటు పని ఉండేలా చూస్తున్నాడు చంద్రశేఖర్. వాళ్లకి ఐడీ కార్డులూ, ఇన్సూరెన్సులూ అందిస్తున్నాడు. ఈ సేవల కోసం కూలీల నుంచి ఒక్కపైసా కూడా తీసుకోడు... బదులుగా స్థిరాస్తి సంస్థలూ కాంట్రాక్టర్ల నుంచే ఫీజులు తీసుకుంటాడు. ఆ రకంగా ఏడాదికి ఐదు కోట్ల రూపాయల ఆదాయం కళ్ల చూస్తున్నాడు! ★



దాల్ కీమా

కావలసినవి: మటన్ కీమా: పావుకిలో, ఉల్లిపాయ ముక్కలు: కప్పు, ఆవనూనె: రెండు చెంచాలు, అల్లం, వెల్లుల్లి పేస్ట్: రెండు చెంచాలు, సన్నగా తరిగిన పచ్చిమిర్చి ముక్కలు: రెండు చెంచాలు, టొమాటోలు: రెండు, పసుపు: అరచెంచా, జీలకర్ర పొడి: చెంచా, దనియాలపొడి: రెండు చెంచాలు, కారం: చెంచా, ఉప్పు: తగినంత, సెనగపప్పు: కప్పు, నీళ్లు: రెండున్నర కప్పులు, గరంమసాలా: చెంచా, పుదీనా తరుగు: రెండు చెంచాలు, నిమ్మకాయ చెక్క: ఒకటి

తయారీ విధానం: స్టవ్ వెలిగించి కుక్కర్ పెట్టుకుని, నూనె వేసి వేడెక్కాక ఉల్లిపాయ ముక్కలు వేసి ఎర్రగా వేయించుకోవాలి. అల్లంవెల్లుల్లి పేస్ట్ వేసి పచ్చివాసన పోయేంతవరకూ వేయించుకుని టొమాటో ముక్కలు, పచ్చిమిర్చి వేసి నూనెపైకి తేలేంతవరకూ ఆగాలి. అప్పుడు పసుపు, జీలకర్రపొడి, దనియాలపొడి, కారం, ఉప్పు వేసి రెండునిమిషాలు వేయించాలి. కీమా కూడా వేసి రంగుమారాక సెనగపప్పూ నీళ్లూ వేసి బాగా కలిపి కుక్కర్ మూతపెట్టి మూడు విజిల్స్ రానివ్వాలి. స్టవ్ కట్టేసి కుక్కర్‌మూత వచ్చాక గరంమసాలా, పుదీనాతరుగు వేసి నిమ్మకాయ పిండుకుంటే రుచికరమైన దాల్‌కీమా రెడీ అవుతుంది.

బటర్ గార్లిక్ ప్రాన్స్



కావలసినవి: రొయ్యలు: 300గ్రా, పసుపు: తగినంత, కారం: ఒకటిన్నర చెంచా, మిరియాలపొడి: అరచెంచా, నూనె: రెండు చెంచాలు, వెల్లుల్లి తరుగు: రెండు చెంచాలు, చిల్లీ ఫ్లేక్స్: రెండు చెంచాలు, వెన్న: రెండు చెంచాలు, నిమ్మరసం: అరచెంచా, కొత్తిమీర తరుగు: చెంచా, ఉప్పు: రుచికి తగినంత.

తయారీ విధానం: రొయ్యలని శుభ్రం చేసుకుని పసుపు, కారం, మిరియాలపొడి, తగినంత ఉప్పు, కొద్దిగా నూనె వేసి బాగా కలుపుకుని ఇరవై నిమిషాలు పక్కన పెట్టేయాలి. స్టవ్‌పైన కడాయి పెట్టి వేడెక్కాక మిగిలిన నూనె వేసుకోవాలి. ఈ నూనెలో మారినేట్ చేసి పెట్టుకున్న రొయ్యలని వేయించుకోవాలి. నీళ్లన్నీ ఇగిరి పోయాక వాటిని తీసి పక్కన పెట్టుకోవాలి. అదే కడాయిలో వెన్న వేసి కరిగాక, వెల్లుల్లి తరుగు, చిల్లీఫ్లేక్స్ వేసి వేయించుకున్నాక రొయ్యలు వేసి బాగా కలిపి, నిమ్మరసం పిండి, కొత్తిమీర చల్లుకోవాలి. ఫ్రైడ్‌రైస్‌లాంటి వాటిల్లోకి సైడ్ డిష్‌గా చాలా బాగుంటుంది.

చికెన్ భర్తా చేస్తారా?

రుచి

మటన్ కీమాని ఎలా తిన్నా రుచే! కానీ ఎప్పుడైనా కాస్త సెనగపప్పుని కూడా జోడించి చూడండి... అబ్బో, ఆ రుచి అమోఘం అనిపిస్తుంది. మామూలు చికెన్‌కి బదులుగా హోటల్‌స్టైల్‌లో చికెన్ భర్తా చేసి చూడండి. రోటీల్లోకి అదిరిపోతుంది. ఇదిగో అలాంటి భిన్నమైన వంటకాలే ఇవి. ఓసారి ప్రయత్నించి చూడండి...

చికెన్ భర్తా



కావలసినవి: బోన్‌లెస్ చికెన్: 300గ్రా, నూనె: రెండు చెంచాలు, నెయ్యి: అరచెంచా, ఉల్లిపాయలు: రెండు, యాలకులు: రెండు, బిర్యానీ ఆకు: ఒకటి, దాల్చినచెక్క: చిన్నముక్క, అల్లం వెల్లుల్లి పేస్ట్: ఒకటిన్నర చెంచా, టొమాటోలు: రెండు, పసుపు: అరచెంచా, కారం: రెండు చెంచాలు, దనియాలపొడి: రెండు చెంచాలు, జీలకర్రపొడి: చెంచా, ఉప్పు: రుచికి తగినంత, గరంమసాలా: చెంచా, తందూరి మసాలా: చెంచా, నానబెట్టి రుబ్బిన జీడిపప్పు పేస్ట్: రెండు చెంచాలు, గిలకొట్టిన పెరుగు: పావుకప్పు, ఫ్రెష్‌క్రీం: రెండు చెంచాలు, కసూరీమేథీ: చెంచా, కొత్తిమీర తరుగు: రెండు చెంచాలు, లవంగాలు: మూడు.

తయారీ విధానం: ముందుగా చికెన్‌ని కుక్కర్‌లో మూడుకూతలు వచ్చేంతవరకూ ఉడికించి, చల్లారిన తర్వాత చేత్తోనే చిన్నచిన్న ముక్కలుగా చేసుకుని పక్కన పెట్టుకోవాలి. స్టవ్‌పైన కడాయి పెట్టి అందులో నూనె, నెయ్యి వేసుకుని వేడెక్కాక బిర్యానీ ఆకు, లవంగాలు, యాలకులు, దాల్చినచెక్క వేసి బాగా వేయించుకోవాలి. సన్నగా తరిగిన ఉల్లిపాయముక్కలు కూడా వేసుకుని దోరగా వేయించుకోవాలి. ఆ తర్వాత అల్లంవెల్లుల్లి పేస్ట్ కూడా వేసి పచ్చివాసన పోయేంతవరకూ వేయించి- టొమాటో ముక్కలు, ఉప్పు, కారం, పసుపు వేసి నూనెపైకి వచ్చేంతవరకూ మగ్గనివ్వాలి. అప్పుడు చిన్నముక్కలుగా చేసి పెట్టుకున్న చికెన్, దనియాలపొడి, జీలకర్రపొడి కూడా వేసి ఐదునిమిషాలు వేయించుకోవాలి. కాస్త రంగుమారాక అందులోనే కప్పున్నర నీళ్లుపోసి పదినిమిషాలు ఉడికించుకోవాలి. మూతతీసి గరంమసాలా, తందూరి మసాలా, జీడిపప్పు పేస్ట్, గిలకొట్టిన పెరుగు వేసి కలుపుకోవాలి. చివరిగా కొత్తిమీర తురుము, కసూరీ మేథీ, క్రీం వేసి దింపేసుకోవడమే.

నా ప్రేమని కేక్‌తో చెప్పా! -దీపికా పదుకోణ్

సెలబ్రిటీ స్పెషల్



నాకు రకరకాల కేక్స్ తయారుచేయడం అంటే చాలా ఇష్టం. మా పాప దువా మొదటి పుట్టినరోజుకి చాలా సింపుల్‌గా నేనొక చాక్లెట్ కేక్ తయారుచేశా. ప్రేమని వ్యక్తీకరించడానికి ఇంత కంటే మంచి మార్గం దొరకలేదు మరి. అదెలానో మీకూ చెబుతా. ఒక కప్పు మైదాకి, ఒక కప్పు చక్కెర, పావుకప్పు చాక్లెట్ పౌడర్, చెంచా బేకింగ్‌పౌడర్, అరచెంచా బేకింగ్ సోడా, చిటికెడు ఉప్పు, అరకప్పు బటర్, రెండు గుడ్లు, చెంచా వెనిల్లా ఎసెన్స్, అరకప్పు చిక్కని పాలు, అరకప్పు వేడినీళ్లు- ఇవి ఉంటే చాలు కేక్ తయారుచేసేయొచ్చు. అవెన్‌ని 180 డిగ్రీల ఉష్ణోగ్రతలో ప్రీ- హీట్ చేసుకుని పెట్టుకోవాలి. ఈలోపు ఒక గిన్నెలో వేడినీళ్లు తప్పించి అన్నిటినీ వేసుకుని ఎక్కడా ఉండల్లేకుండా గిలకొట్టి పెట్టుకోవాలి. వేడినీళ్లని నెమ్మదిగా కలుపుతూ కేక్‌పాన్‌లో వేసుకుని అరగంటపాటు బేక్ చేసుకుంటే రుచికరమైన చాక్లెట్ కేక్ సిద్ధం.



సిసింద్రీ

దారి కనుక్కోండి

పైలట్‌కి హెలికాప్టర్‌ను ల్యాండ్ చేయడం కష్టమవుతోందట. హెలిపాడ్‌కు దారి చూపి, సాయం చేయరూ!




చెప్పగలరా?

పిల్లలంతా గార్డెన్‌లో కాలక్షేపం చేస్తున్నారు కదూ! ఇందులో ఆంగ్ల అక్షరం 'C'తో మొదలయ్యే జీవులూ, వస్తువుల పేర్లూ ఉన్నాయి. అవేంటో చెప్పగలరా?



ఆ ఒక్కటి ఏది?

ఇక్కడున్న గిఫ్ట్ బాక్సుల్లో ఒకదానికి మాత్రం దాన్ని పోలిన జత లేదు. జాగ్రత్తగా గమనించి అది ఏదో చెప్పండి చూద్దాం.



తేడాలేంటి?

ఈ రెండు బొమ్మల మధ్య ఎనిమిది తేడాలున్నాయి. అవేంటో కనిపెట్టండి మరి.





తర్వాతే తెలిసింది...

నాన్న: ఏంటి లల్లీ... లెక్కల్లో సున్నా మార్కులొచ్చాయి...

లల్లీ: మా పాత టీచరే కాస్త నయం నాన్నా. ఒకట్రెండు మార్కులిచ్చేవారు...


నాన్న: అలాంటప్పుడు లెక్కల టీచర్‌ని మార్చమని ఎందుకు అడిగారు మరి?

లల్లీ: మాకు కూడా టీచర్ మారిన తర్వాతే తెలిసొచ్చింది నాన్నా...

నాన్న: ఆ..!

బొమ్మ గీద్దాం





అవి ఏవి?

ఇక్కడ కొన్ని బొమ్మలున్నాయి. వాటిల్లో రెండు తప్ప మిగతావన్నీ ఒకదానికొకటి సంబంధం ఉన్నవే. మరి ఆ రెండూ ఏవో గుర్తించండి.



దాగని మోసం!


పట్నం వెళ్లి వస్తున్న పాపన్నకు దారిలోని ఓ ఊరిలో గ్రామాధికారి ఇంటికి నిప్పంటుకోవడం కనిపించింది. ఇంతలో ఆ ఇంటి వెనక నుంచి ఒకామె 'అయ్యో... వంటింట్లో బిడ్డ చిక్కుకుపోయాడు... కాపాడండి' అని అరవసాగింది. అది విన్న పాపన్న... మంటల మధ్యలోంచే ఇంట్లోకి వెళ్లి బాబును బయటకు తీసుకొచ్చాడు. అప్పుడే అక్కడికొచ్చిన గ్రామాధికారి నౌకరొకరు- బాబును తన చేతుల్లోకి లాక్కొని, యజమాని దగ్గరకెళ్లాడు. 'అయ్యా... మంటల్లోంచి బాబును కాపాడి తీసుకొచ్చా. కాస్త ఆలస్యమైతే బిడ్డ ఏమై ఉండునో..' అన్నాడు. 'నా వారసుడిని రక్షించిన నీ రుణం ఎప్పటికీ తీర్చుకోలేను' అన్నాడా యజమాని. కాలిన గాయాలతోనే



ఇంటికి చేరిన పాపన్న... చొక్కా విప్పుతుండగా... అందులోంచి ఏదో బరువుగా కిందపడింది. ఏంటా అని చూస్తే, అది బంగారు మొలతాడు. గ్రామాధికారి కొడుకుది. వారం తర్వాత.. దాన్ని తిరిగిచ్చేందుకు గ్రామాధికారి ఇంటికెళ్లాడు పాపన్న. కాలిపోయిన ఇంటి స్థలంలో కొత్తది కడుతున్నారు. బాబును లాక్కెళ్లిన ఆ నౌకరు కూలీలపైన పెత్తనం చెలాయిస్తూ కనిపించాడు. అతడి దగ్గరికెళ్లిన పాపన్న... 'బాబును కాపాడే క్రమంలో వాడి బంగారు మొలతాడు నా చొక్కాలో చిక్కుకుంది. మీ యజమాని ఎక్కడుంటున్నారో చెబితే వెళ్లి తిరిగిచ్చేస్తా' అన్నాడు. పాపన్న యజమాని దగ్గరికెళ్తే, బాబును తనే కాపాడినట్లు చెప్పినదంతా అబద్ధమని తెలిసిపోతుందని భయపడ్డాడా నౌకరు. దాంతో వాళ్లు ఊళ్లో లేరని అబద్ధం చెప్పాడు. 'ఆ మొలతాడును నాకు ఇవ్వండి... మా యజమానికి అప్పగిస్తాను' అనడంతో సరేనంటూ ఇచ్చేశాడు పాపన్న. మొలతాడును అలాగే కాజేస్తే ఎప్పటికైనా ప్రమాదమేనని అనుకున్న నౌకరు... దాన్ని కరిగించాలని అనుకున్నాడు. వెంటనే కంసాలి దగ్గరికెళ్లి ఆ మొలతాడును ఇచ్చి కరిగించమన్నాడు. అది తను తయారు చేసిందే కావడంతో అనుమానం వచ్చిన ఆ కంసాలి... గ్రామాధికారికి కబురు చేశాడు. ఆయన వచ్చి నౌకరును నిలదీశాడు. బిడ్డను కాపాడింది తను కాదనీ, పాపన్న అనీ చెప్పడంతో అసలు నిజం బయటపడింది. అతడిని పనిలోంచి తొలగించి... పాపన్న ఇంటికెళ్లి మరీ కృతజ్ఞతలు చెప్పాడు గ్రామాధికారి. విలువైన కానుకలూ అందజేశాడు. మోసం, దొంగతనం ఎక్కువకాలం దాగవనుకుంటూ ఇంటి దారి పట్టాడు నౌకరు.

పోలికలేంటి?

ఈ బొమ్మల్లో అడ్డం, నిలువు, ఐమూలలుగా ఉన్నవాటికి కొన్ని పోలికలున్నాయి. అవేంటో చెప్పగలరా?



జవాబులు


తేడాలేంటి?: 1. కిటికీలోంచి కనిపించే రాయి 2. కర్టెన్ల రంగు 3. గోడకున్న అల్మారా 4. కుడి చివరనున్న బాబు చెయ్యి 5. నీళ్ల సీసా 6. స్కూల్ బ్యాగ్ దిశ 7. షెల్ఫ్‌లోని పుస్తకాల సంఖ్య 8. మాస్టారు పక్కన కూర్చున్న బాబు చొక్కా. **అవి ఏవి?:** సైకిల్ పంపు, బల్బు.

పోలికలేంటి?: అడ్డం: ఛార్జర్, పెన్నుల స్టాండు, గ్లోబు; నిలువు: మైక్, గొడుగు, బ్యాగు; ఐమూలగా: భూతద్దం, పుస్తకం.

చెప్పగలరా?: Caterpillar, Crow, Coconut tree, Candle, Clouds, Cup, Cap.

ఆ ఒక్కటి ఏది?: 8

నర్సాపూర్ ఎక్స్‌ప్రెస్



అదేదో సినిమాలో అమితాబ్ బచ్చన్ 'మేరే పాస్ మా హై'! అనే డైలాగు మహా గంభీరంగా చెబుతాడు. ఆ రెండు పాత జిల్లాల వాళ్లు కూడా సందర్భోచితంగా చాలాసార్లూ, సందర్భాన్ని సృష్టించుకుని మరీ కొన్నిసార్లూ 'మాకు గోదారి ఉందండోయ్' అని అంతే పరవశంగా ప్రకటిస్తారు. ఇక నర్సాపురం వాళ్లకైతే ఆ అభిమానం పిసరంత ఎక్కువే. ఆ మక్కువతోనే... 'ఆయ్! మాది నర్సాపురవండి!' అనే పేరుతో ఏకంగా ఓ జ్ఞాపకాల బూరెలబుట్టను సిద్ధం చేశారు భావరాజు పద్మినీ ప్రియదర్శిని. ముందు కిరసనాయిలు పంతులుగారి కథ చెప్పి... ఆ తర్వాత అంతర్వేది తీర్థానికి తీసుకెళ్లి... పన్లోపనిగా గజ ఈతగాడు గోపాను పరిచయం చేసి... మధ్యలో మరిడయ్య వెటకారాలు వినిపించి... మర్చిపోకుండా 'మూగ మనసులు' మేడను చూపించి... ఇంకా అనేక అనుభూతుల్ని పంచి... నర్సాపురం అక్షర యాత్రా స్పెషల్‌ను విజయవంతంగా పూర్తిచేస్తారు రచయిత్రి.

ఆయ్! మాది నర్సాపురవండి!; రచన: భావరాజు పద్మినీ ప్రియదర్శిని
పేజీలు: 136, వెల: రూ.350; ప్రతులకు: ఫోన్: 8558899478


మహిళ హృదయావిష్కరణ

ఆమె ఎప్పట్లానే సహనంలో భూదేవే. కానీ, ఆ సహనానికి కూడా హద్దులు ఉంటాయని కొత్తగా తెలుసుకున్న వివేకవంతురాలు. అవసరమైతే ప్రశ్నిస్తుంది. తేడావస్తే నిలదీస్తుంది. తప్పనిసరైతే తనదారి తాను చూసుకుంటుంది. ఈ సంకలనంలో, మహిళల్లో విస్తరిస్తున్న స్వతంత్ర భావాలను ప్రతిబింబించే కథలే ఎక్కువ. ఏ అమెరికాలోనో ఉన్నవాళ్లకే కాదు, మన ఇంట్లో కూడా ఎవరి టైమ్‌జోన్లు వారికి ఉంటున్నాయి. వాటిని సమన్వయం చేసుకోలేక ఇల్లాలు పడుతున్న ఇబ్బందుల్ని 'టైమ్‌జోన్' కథ హృద్యంగా ఆవిష్కరించింది. తన కుటుంబంలోనే తాను ద్వితీయశ్రేణి పౌరురాలైన ఓ ఇల్లాలు ఆర్థిక స్వాతంత్ర్యంతో పొందే గుర్తింపును 'పాలకపక్షం' కథ సూటిగా చెప్పింది. 'ఔను, నాకు నచ్చలేదు!' సంకలనంలోని ఇరవై పైచిలుకు కథల్లోనూ మహిళల ఆత్మగౌరవ ఆకాంక్ష బలంగా వినిపిస్తుంది. ఆమె జీవితం మీద ప్రపంచీకరణ ప్రభావాన్నీ విశ్లేషించారు రచయిత్రి.



ఔను, నాకు నచ్చలేదు! (కథలు); రచన: సింగరాజు రమాదేవి
పేజీలు: 189; వెల రూ.225; ప్రతులకు: అనల్పబుక్స్.కామ్

సున్నిత భావాల సమాహారం



పదమూడో శతాబ్దానికి చెందిన పర్షియన్ కవి... రూమీ. మార్మికత, భావుకత అతని కవిత్వానికి ముడిసరుకులు. 'ఆసుపత్రి గోడలు ఆలయాలకంటే ఎక్కువ ప్రార్థనలను విని ఉంటాయి' అనగలిగిన మానవతావాది. రూమీ స్ఫూర్తితో వసుధారాణి రాసిన భావ గాఢత కలిగిన కవితలు ఇవి. 'అత్యద్భుతం అనుకున్నవన్నీ సాదాసీదాగా కనిపించడం మొదలైతే, మనం అద్భుతంగా మారినట్టు' అంటారు ఒకచోట. నిజమే, వికాసానికి అదే అత్యున్నతమైన మెట్టు! 'కలుక్కుమన్న ప్రతిసారీ, కాసేపటికి గుండె సర్దుకుంటుంది! కాలం మందు పనిచేస్తూనే ఉంటుంది' అనడం వెనుక ఎన్ని గాయాల సర్దుబాట్లు ఉన్నాయో! నూట ఎనభై రూమీ శైలి పదాల సమాహారం ఈ పుస్తకం.

రూమీ తరువాత ... కవితలుగా మారిన క్షణాలు
రచన: వసుధారాణి, పేజీలు: 184; వెల రూ.150; ప్రతులకు: ఫోన్: 9959839446

స్నేహమేరా జీవితం!

కౌమారం... భలే విచిత్రమైన దశ. పదేళ్ల తర్వాతో, పాతికేళ్లు గడిచాకో నెమరేసుకుంటే, అంతా ఓ ఈస్ట్‌మన్ కలర్ కలలా గోచరిస్తుంది. ఆ జ్ఞాపకాలు ఆస్తిపాస్తుల కంటే అమూల్యంగా అనిపిస్తాయి. ఆ వయసు అలాంటిది! ప్రతి పరిచయాన్నీ స్నేహం కిందే జమకట్టేస్తాం. నేస్తాలే సమస్తమని భావిస్తాం. అదనంగా, ఆకర్షణల అయస్కాంతత్వాలూ. ఆ అందమైన అధ్యాయానికి అక్షరరూపం... '96. ఎంసెట్ లాంగ్‌టర్మ్ కోచింగ్ కోసం హైదరాబాద్‌లో అడుగుపెట్టే ఓ కుర్రాడి కథ ఇది. బస్‌స్టాప్ పరిచయాలూ, క్లాస్‌రూమ్ కబుర్లూ, 'ఫైవ్‌స్టార్' లంచాలూ... కథలో భాగమై ఒదిగిపోయాయి. గమ్మత్తయిన శైలి గబగబా చదివిస్తుంది. తొంభైలనాటి ఆ సంఘటనల్లో కొన్నింటిని మన జీవితాల్లోంచీ తీసుకున్నట్టు అనిపిస్తుంది. ఆ మ్యాజిక్కే రెండో భాగం కోసమూ ఎదురుచూసేలా చేస్తుంది.



'96; రచన: ఎస్2
పేజీలు: 192, వెల: రూ.220
ప్రతులకు: ఫోన్: 9014894145 (వాట్సాప్)

బుక్‌షెల్ఫ్

ప్రపంచ ప్రసిద్ధ నాటికలు
రచన: డాక్టర్ లంకా శివరామప్రసాద్
పేజీలు: 677, వెల: రూ.600
ప్రతులకు: ప్రధాన పుస్తక కేంద్రాలు

సమన్విత (కథలు)
రచన: జ్యోతి వలబోజు
పేజీలు: 70, వెల: రూ.100
ప్రతులకు: ఫోన్: 9440124700

విలీనం-విభజన
(గతం-స్వగతం... మన ముఖ్యమంత్రులు)
రచన: ఇనగంటి వెంకట్రావు; పేజీలు: 406, వెల: రూ.360
ప్రతులకు: ప్రధాన పుస్తక కేంద్రాలు

కదిలే కాలంలో మెదిలే జ్ఞాపకాలు
రచన: కాట్రగడ్డ శేషగిరిరావు; పేజీలు: 181, వెల: అమూల్యం
ప్రతులకు: ఫోన్: 9840072338

సినీమాన్యులు-2 (సినిమా కథలు, తారలు, తారేతరులు)
రచన: ఎమ్బీయస్ ప్రసాద్
పేజీలు: 248, వెల: రూ.150
ప్రతులకు: ప్రధాన పుస్తక కేంద్రాలు

దేవుడున్నాడు జాగ్రత్త!
రచన: ఎం.వి.ఆర్. శాస్త్రి
పేజీలు: 286, వెల: రూ.300
ప్రతులకు: ఫోన్: 9347015506

ఒక కథనం...
ఉరికొయ్యకు వేలాడింది
(వ్యాసాల సమాహారం)
రచన: సీతారాం ఏచూరి
అనువాదం: కె.సత్యరంజన్, కె.ఉషారాణి
పేజీలు: 280, వెల: రూ.280
ప్రతులకు: ఫోన్: 9490099437

రాశి ఫలం

గ్రహబలం
(అక్టోబరు 12 - 18)

డా॥ శంకరమంచి రామకృష్ణ శాస్త్రి



మేషం అశ్విని, భరణి, కృత్తిక 1వ పాదం

అనుకున్నది సాధిస్తారు. ఎదుగుదలకు అవకాశాలు ఉన్నాయి. మీ కర్తవ్యాన్ని నిబద్ధతతో నిర్వర్తించండి. అవరోధాలను అధిగమించి, అనుకున్నది సాధిస్తారు. సమాజంలో గుర్తింపు లభిస్తుంది. వివాదాలకు దూరంగా ఉండండి. ముఖ్య నిర్ణయాల్లో పరాధీనత పనికిరాదు. ఆర్థిక వ్యవహారాల్లో జాగ్రత్త. విష్ణు సహస్రనామాన్ని పఠించండి.

వృషభం కృత్తిక 2,3,4 పాదాలు; రోహిణి, మృగశిర 1,2 పాదాలు

ఆశించినవన్నీ నెరవేరతాయి. బలమైన ప్రయత్నం అవసరం. వ్యాపారం లాభదాయకం. గ్రహాలు సహకరిస్తాయి. సృజనాత్మకంగా ఆలోచిస్తారు. పెట్టుబడులు సానుకూల ఫలితాలను అందిస్తాయి. ఆర్థిక ప్రయోజనాలు సిద్ధిస్తాయి. వృత్తి నైపుణ్యాన్ని పెంచుకుంటారు. ఈవారం ఓ శుభవార్త వింటారు. లక్ష్మీ అష్టోత్తరం పఠించండి.

మిథునం మృగశిర 3, 4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3 పాదాలు

మనోబలంతో పనులను ఆరంభించండి. ఫలితాలు అనుకూలంగా ఉంటాయి. ఏ విషయంలోనూ వెనకడుగు వేయకండి. పొదుపు-మదుపు చర్యలకు ప్రాధాన్యం ఇవ్వండి. రుణ సమస్యలతో జాగ్రత్త. కుటుంబ సభ్యులతో సంప్రదించాకే ముఖ్య నిర్ణయాలు తీసుకోండి. ప్రతి అడుగూ ఎరుకతో వేయండి. సమయానుకూలంగా వ్యవహరించండి. నవగ్రహాల్ని ధ్యానించండి.

కర్కాటకం పునర్వసు 4వ పాదం; పుష్యమి, ఆశ్లేష

శుభాలు జరుగుతాయి. కాలం అన్ని విధాలుగా సహకరిస్తుంది. పెద్దల ప్రోత్సాహం లభిస్తుంది. ఉద్యోగ ఫలితాలు అత్యుత్తమంగా ఉంటాయి. కొన్ని వ్యవహారాల్లో లాభనష్టాలకు అతీతమైన నిర్ణయాలు తీసుకుంటారు. ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న పని పూర్తవుతుంది. గృహ, వాహన యోగాలు ఉన్నాయి. సుబ్రహ్మణ్య స్వామిని స్మరించుకోండి.

సింహం మఖ, పుబ్బ, ఉత్తర 1వ పాదం

భవిష్యత్తు అత్యుత్తమం. కల సాకారం అవుతుంది. పనుల్లో పురోగతి ఉంటుంది. గతంలోని చిక్కుముళ్లు వీడిపోతాయి. లౌక్యంతో వ్యాపార సమస్యల నుంచి బయటపడతారు. గత అనుభవాల్ని బట్టి పెట్టుబడులకు సంబంధించిన నిర్ణయాలు తీసుకోండి. కుటుంబ సభ్యుల సలహాలకు విలువ ఇవ్వండి. సూర్యుడిని ధ్యానించండి.

కన్య ఉత్తర 2, 3, 4 పాదాలు; హస్త, చిత్త 1, 2 పాదాలు

మనోబలంతో నిర్ణయాలు తీసుకోండి. కృషికి తగిన గుర్తింపు లభిస్తుంది. లక్ష్య సాధనలో కాలం తోడుగా నిలుస్తుంది. చిన్నపాటి ప్రయత్నాలు కూడా పెద్ద ప్రయోజనాలను అందిస్తాయి. ఆటంకాలు సృష్టించేవారితో జాగ్రత్త. సకాలంలో పనులను ఆరంభించండి. ఓ మంచివార్త వింటారు. ఈశ్వరుడిని ప్రార్థించండి.

తుల చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

శ్రమకు తగిన ఫలితం అందుతుంది. స్పష్టమైన ఆలోచనతో అనుకున్నది సాధిస్తారు. ఉద్యోగంలో పొరపాట్లు జరగకుండా జాగ్రత్తపడండి. ఓర్పు చాలా అవసరం. వినయగుణం మిమ్మల్ని కవచంలా కాపాడుతుంది. చిన్నపాటి అవరోధాలు ఎదురైనా అసహనం వద్దు. ఆర్థిక వ్యవహారాల్లో ఆచితూచి నిర్ణయాలు తీసుకోవాలి. దుర్గాదేవిని ధ్యానించండి.

వృశ్చికం విశాఖ 4వ పాదం; అనూరాధ, జ్యేష్ఠ

ఆత్మవిశ్వాసం ముందుకు నడిపిస్తుంది. ఉద్యోగులకు మేలు జరుగుతుంది. స్థిరమైన నిర్ణయాలతోనే విజయాలు వరిస్తాయి. ఆర్థికంగా మంచి జరుగుతుంది. వృత్తి ఉద్యోగాల్లో ఏకాగ్రత అవసరం. పొదుపు, మదుపుపైన దృష్టిపెట్టండి. మొహమాటం వల్ల సమస్యలు ఎదురుకావచ్చు. ఓ చిన్న ఇబ్బంది నుంచి బయటపడతారు. వేంకటేశ్వరస్వామిని పూజించండి.

ధనుస్సు మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1వ పాదం

అత్యుత్తమ సమయం. చేపట్టిన కార్యక్రమాలు విజయవంతం అవుతాయి. ఉద్యోగంలో మేలు జరుగుతుంది. పెట్టుబడులు రాబడులను అందిస్తాయి. భూలాభం సూచితం. గతంలో ఆగిపోయిన పనులు ఈవారం స్పష్టమైన రూపాన్ని దరిస్తాయి. వృత్తి, ఉద్యోగాల్లో ప్రణాళిక అవసరం. అష్టలక్ష్మిని ధ్యానించండి.

మకరం ఉత్తరాషాఢ 2, 3, 4 పాదాలు; శ్రవణం, ధనిష్ఠ 1, 2 పాదాలు

మనోబలం అవసరం. అర్థంలేని విమర్శల్ని మనసులోకి తీసుకోకండి. ఆర్థిక ప్రయోజనాలు సిద్ధిస్తాయి. ఆదాయ మార్గాలు విస్తరిస్తాయి. ఆలోచనలకు పరిమితం కాకుండా, ఆచరణకు ప్రాధాన్యం ఇవ్వండి. ఆత్మవిశ్వాసంతో గండాలను గట్టెక్కుతారు. వారాంతంలో శుభవార్త వింటారు. నవగ్రహ శ్లోకాలు చదువుకోండి.

కుంభం ధనిష్ఠ 3, 4 పాదాలు; శతభిషం, పూర్వాభాద్ర 1, 2, 3 పాదాలు

సమయస్ఫూర్తి అవసరం. కాలాన్ని సద్వినియోగం చేసుకోండి. వేగంగా లక్ష్యాలను పూర్తి చేయండి. వివాదాలకు ఆస్కారం ఇవ్వకండి. ఆర్థిక ఫలితాలు మిశ్రమం. కొత్త నైపుణ్యాలను పెంచుకోండి. ఎరుకతో నిర్ణయాలు తీసుకోవాలి. కుటుంబ సహకారం లభిస్తుంది. మీ గతానుభవం ఇబ్బందుల నుంచి ఒడ్డునపడేస్తుంది. ఇష్టదైవాన్ని ప్రార్థించండి.

మీనం పూర్వాభాద్ర 4వ పాదం, ఉత్తరాభాద్ర, రేవతి


ఆత్మవిశ్వాసంతో వ్యవహరించండి. కాలం కొంత వ్యతిరేకంగా ఉంది. ప్రతి అడుగూ ఆచితూచి వేయాలి. ఒత్తిడికి అతీతంగా పనిచేయండి. మీ ఎదుగుదలకు అడ్డంకులు సృష్టించేవారితో జాగ్రత్తగా ఉండండి. చాలా సందర్భాల్లో మౌనమే ఉత్తమం. మీ మంచితనమే మిమ్మల్ని కాపాడుతుంది. ఆధ్యాత్మిక శక్తిని పెంచుకోండి. నవగ్రహ శ్లోకాలను పఠించండి.

పదకేళి

కూర్పు: బాలు

అడ్డం

1. ఒక ఆయుధం (3)
4. పైకి అమాయకత్వం నటించే గడుసువారిని వ్యంగ్యంగా ఇలా అంటారు (4)
8. పార్లమెంట్లో ఎగువ సభ (4)
9. చరించు, సంచరించు (3)
11. జవాను, సైనికుడు (3)
13. పలవరింత; అర్థంలేని మాట (3)
14. అడ్డం 38తో నీచకార్యాలు, పాతకాలు (1)
16. శత్రువు (3)
17. తనయుడు (3)
19. సరస్వతి (3)
22. కుక్క (3)
23. భరతుడి తల్లి (4)
26. పెళ్ళికొడుకు (3)
28. గేదె (2)
29. 'స్థిరం' వికృతి (2)
30. కన్నీరు (2)
31. ఏనుగు (2)
33. ఒక నది; గ్రామదేవత (3)
35. ఆశీర్వదిస్తూ తలపై చల్లేవి... పసుపు కలిపిన బియ్యం (4)
36. నింగి (3)
38. క్షీరం (2)
39. సన్మానం (4)
41. పరిమళం (4)
43. దేవుడు ప్రత్యక్షమై... ఇచ్చేది (2)
44. పెంపుడు పక్షిని ఉంచేందుకు ఏర్పాటు (3)
45. హేళన, పరిహాసం (4)
46. భద్రం, పైలం (3)
47. వనిత; లేత (2)



నిలువు

1. ఇంటి పెరట్లో బాల్కనీలో పవిత్రమైన మొక్క (3)
2. బాడుగ, అద్దె (3)
3. మకరం (3)
5. తలకిందులుగా చెట్లకు వేలాడే పక్షులు (4)
6. శవదహనం కోసం కట్టెల పేర్పు (2)
7. నూలు, పోచ; చెవిరింగు (2)
10. మిక్సీలు లేని రోజుల్లో ఇందులోనే పప్పు రుబ్బేవారు (4)
12. అర్జునుడు (3)
15. నడుముకు కత్తిని వేలాడదీసే కోశం (2)
17. కొరత, లోటు (3)
18. శ్రీరాముడి కుమారుడు (3)
19. పార్వతి (4)
20. 'దశమి'లో అవస్థ (2)
21. మనస్సు (4)
24. ధర్మరాజు కన్నతల్లి (2)
25. పువ్వు (2)
27. శివుడి మెడలోని పూసలు (4)
30. నాయనమ్మ, అవ్వ (2)
31. పైరులో పెరిగే గడ్డిమొక్కలు (3)
32. రూపం (3)
34. పోయిన వారం, లాస్ట్ వీక్ (4)
35. తప్పుగా అర్థం చేసుకోవడం (3)
36. అవకాశం (3)
37. తల్లి సోదరుడు!? (4)
40. శబ్దం, సవ్వడి (3)
41. మంచినీళ్ళు... అని అర్థం (3)
42. వేడి, వడ, ఉష్ణం (2)
44. వరాహం (2)

సుడొకు

8				7	5	2		
		7		1			3	4
		1	2					
7				6		1	2	
3		6	1		9	4		7
	9	2		8				5
					6	9		
2	8			5		7		
		9	7	4				3

గతవారం సమాధానాలు

పదకేళి

1 వ	జ్రం	❀	2 చా	3 సో	❀	4 ప్ర	5 మా	6 దం	❀	7 హం	❀
రా	❀	8 జం	❀	9 దా	10 చా	❀	11 మీ	డ	12 త	❀	13 కో
14 హం	15 స	ధ్వ	16 ని	❀	17 చా	18 ముం	డి	❀	19 ల	20 హ	రి
❀	వ్వ	❀	21 ఘా	22 తం	❀	గి	❀	24 ఆ	❀	25 రి	క
26 తా	డి	27 మ	❀	28 పి	29 పా	స	❀	30 ల	తి	క	❀
మ్మి	❀	31 స	32 దా	❀	ణి	❀	33 భ	యం	❀	34 థ	35 వ్య
36 ధి	37 న	క	రు	డు	❀	38 వి	ర	❀	39 క్తి	❀	స
❀	వ	❀	వృ	❀	40 వె	లు	తు	రు	❀	41 హా	న
42 అ	ల	43 క	❀	44 షు	❀	45 కా	డు	❀	46 దో	ర	❀
డ	❀	47 బ	ల	భ	ద్ర	డు	❀	48 స	ర	సు	లు
49 వి	50 రా	ళం	❀	క	❀	❀	51 గుం	❀	52 సా	లు	❀
❀	గి	❀	53 త	రం	గం	❀	54 జ	న	ని	❀	55 రం

సుడొకు

9	2	5	7	1	3	4	6	8
1	7	6	4	8	2	9	5	3
4	8	3	9	6	5	2	1	7
3	5	7	8	9	1	6	2	4
2	4	9	6	3	7	5	8	1
8	6	1	2	5	4	3	7	9
5	3	2	1	7	9	8	4	6
7	9	8	5	4	6	1	3	2
6	1	4	3	2	8	7	9	5







నువ్వూ నేనూ సేమ్ టూ సేమ్!



'అక్కాచెల్లెళ్లు ఇద్దరూ సేమ్ టూ సేమ్ ఉన్నారే', 'బుగ్గ మీదున్న పుట్టుమచ్చతో సహా ఒకే పోలికలతో భలే ఉన్నారు' అంటూ కవలపిల్లల్ని చూసి కాస్త ఆశ్చర్యపోతుంటాం, ముచ్చటపడుతుంటాం. అలాంటి అచ్చుగుద్దిన పోలికలు మనుషుల్లోనే కాదు, జంతువుల్లోనూ చూడొచ్చండీ. కావాలంటే ఇక్కడున్న జంతువుల జంట ఫొటోల్ని పరిశీలించండి విషయం మీకే అర్థమవుతుంది. పెంపుడు జంతువుల్లో అరుదుగా కనిపించిన యానిమల్ ట్విన్స్ ఫొటోల్ని వివిధ ప్రాంతాల నుంచి యజమానులు సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేశారు. రంగూ, రూపమూ, కళ్లూ, ఒంటి మీద మచ్చలూ... ఇలా అన్నీ ఒకేలా ఉన్న వీటిని చూస్తుంటే ఎవరికైనా ముద్దొచ్చేయదూ!
















కొండ దిగువన, పచ్చటి గడ్డిని దుప్పటిలా కప్పుకున్న ఈ ఇళ్ల వరుసలన్నీ భలే గమ్మత్తుగా ఉన్నాయి కదూ! ఆ ప్రత్యేకత వల్లే హంగేరీలోని హార్‌సెగ్‌కూట్ అనే ఈ ఊరు ఓ పర్యటక ప్రాంతమైంది కూడా. అసలు ఈ ఇళ్ల కథేంటీ అంటే... కొన్ని వందల సంవత్సరాల క్రితం నుంచీ ద్రాక్ష సాగూ, వైన్ తయారీకీ ఈ ప్రాంతం ఎంతో ప్రసిద్ధి. అందుకే అప్పట్లో వైన్ నిల్వల కోసం త్రికోణాకృతిలో ఈ అరుదైన ఇళ్లను నిర్మించారు. వైవిధ్యమైన ఆ వైన్ సెల్లార్ల గ్రామమే ఇప్పుడు చక్కటి సందర్శక ఆకర్షణగా నిలిచిందన్నమాట!